MNS 01 07125 C

ప్రత్యూష

(నాటికలు)

★

మగదల రామచంద్రరావు

★

ఉజ్వల ప్రచురణాలు

కర్నూలు.

CI

blank page

MNS01G7125 Z

ప్రత్యూష

(నాటికలు)

★

మగదల రామచంద్రరావు

★

ఉజ్జ్వల ప్రచురణలు
కర్నూలు.

ఉజ్వల ప్రచురణ
ప్రథమ ముద్రణ
డిశంబర్, 1961.

ముద్రణ:
శ్రీ దుర్గా ప్రెస్
నంద్యాల

★

సంపాదకుడు

డి. మనోహర్

౨

ప్రత్యూష

1957 డిసెంబరు ఉస్మానియా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల నాటకోత్సవములలో ప్రదర్శింపబడి ఉత్తమ ప్రదర్శనకూ రచనకూ ప్రథమ బహుమతి నందినది.

నాటి నటవర్గం

డాక్టరు: మగదల రామచంద్రరావు

రెడ్డి: బి. నారాయణ

రమణ: యస్. వెంకటేశ్వరావు

రజని: శివరాం

గోవిందంపంతులు: లక్ష్మీనారాయణ

కరణం: కె. చక్రధర్

తాత: పార్థసారథి

కాంపౌండరు: రాంబాబు

సంగీత నిర్వహణ: నండూరి పార్థసారథి

పర్యవేక్షణ:

శ్రీ వేటూరి ఆనందమూర్తి M. A.

3

ఒకమాట

ప్రేక్షకులు గమనించవలసిన ముఖ్యాంశాలు రెండు.

ఈ నాటికలో టెక్నిక్ వుంది.

ఇది నటనా ప్రాముఖ్యమైంది.

రమణ, రజని, గోవిందంపంతుళ్లకు— అంతవరకూ పల్లె ప్రాంతాల పరిచయంలేదు. యీ ముగ్గురికీ, డాక్టరు పదేళ్ల క్రింద అలాంటి పల్లెలోనే జరిగిన మరో డాక్టరు (రాజారావు) కథను చెబుతాడు. పల్లెటూరి ప్రజలూ, వారిమనస్తత్వాలూ అర్థంకాని ఆ ముగ్గురూ కథ చెబుతున్న డాక్టరునే, కథలోని రాజారావుగా ఊహించుకొంటారు. కథలో వచ్చే వెంకటరెడ్డి, శేషయ్య, రామస్వామి పాత్రలను- తాము ప్రతి నిత్యమూ చూసే పెద్దిరెడ్డి, కరణం, నారాయణలుగానే భావిస్తారు. కనుక మొదటి డాక్టరు, పెద్దిరెడ్డి, కరణం, నారాయణ పాత్రధారులే- అంతర్నాటకంలోని రాజారావు, వెంకటరెడ్డి, శేషయ్య, రామస్వామి పాత్రల ధరించాలి. ప్రేక్షకులకు కథ అర్థమనటం కోసం అంతర్నాటకంలోని వేష ధారణలో కాస్త మార్పు సూచిస్తేసరి. ఇదీ యిందులోని టెక్నిక్.

ఇహపోతే, తెరవాలినప్పుడు ఆంధ్ర ప్రేక్షకుల రసస్థాయిఅందరికీ తెలిసినదే గనుక అలా తెరజారటంలేకుండానే లైట్లు Off and on చేయటంద్వారా Continuity సాధించవచ్చుననే అభిప్రాయంతో లైట్లారి వెలుగటాన్ని ఎక్కువగా

వుపయోగించ వలసివచ్చింది. జాగ్రత్తగా నిర్వహిస్తే యిదే మాత్రమూ లోపంగా కనిపించదు.

ఈ నాటికలో కేవలం డైలాగులు పటిష్టంగా ఉచ్చరించటమేకాక **Movements** విషయమై శ్రద్ధ తీసుకోవాలి.

ఉస్మానియా అంతర్ కళాశాలల నాటకోత్సవములలో హైదరాబాదులో ప్రదర్శించినప్పుడు ఎందరో ఎన్నో విధాలుగా సహాయపడ్డారు. ముఖ్యంగా తమ వెలలేనిసలహాల నొసంగి ప్రదర్శనం ఫలప్రదమవటంలో చేయూతనిచ్చిన శ్రీ మంచాల జగన్నాధరావు శ్రీ వి. పురుషోత్తం శ్రీ రాధాక్రిష్ణ శ్రీ వేటూరి ఆనందమూర్తిగార్లకు నా కృతజ్ఞతలు.

రచయిత

తెర జరిగింది రంగం చీకటిగావుంది.

వెనుక ఎక్కడో వినపిస్తూన్న జానపద గీతం దగ్గరగా వస్తోంది. చిట్టి తాళాల చప్పుళ్లూ, అప్పుడప్పుడు అరచేతి చరుపులూ తాళాను గుణ్యంగా వినిపిస్తూ గీతాన్ని మరింత శ్రావ్యపరుస్తున్నాయి. ఇంతలో వున్నట్లుండి దూరమైపోయింది గీతం- ఒక్క నిమిషంలో రంగం నిశ్శబ్దం.

బయట్నుంచి:- నారాయణా! (తలుపుతట్టుతూ) నారాయణా!! నారాయణా!!

లోపల్నుంచి: ఊ!! (మూల్గుతూ)

బయట్నుంచి: నారాయణా! (కొస్త బిగ్గరగా)

లోపల్నుంచి: (నిదర్నిసుత్తుగా) ఊ! ఎవరదీ?

(లైట్లు వెలిగినై - రంగం యిప్పుడు విశదంగా వుంది. ఓ పల్లెటూర్లో డాక్టరుగది.)

నారాయణ: యెవరూ?(లోపల్నుంచి బద్ధకంగా వస్తూ)

బయట్నుంచి: నేనేలే నారాయణా!! తలుపు తెరు...డాక్టరు గారు పంపారు

నారా: ఆఁ! వస్తున్నా - (బయటికి వెళ్ళి తలుపు తీశాడు)

(ముసలి తాత ప్రవేశం)

తాత: ఇదుగో నారాయణా డాక్టరు యీ సీటీ నీకిచ్చి నిన్ను వెంటనే బయల్దేరి రమ్మంటున్నారు.

నారా: (చదువుకున్నాడు) ఆఁ! ఏమిటిదీ? ఎందుకని?

తాత: ఎందుకనేమిటెే? కొట్టుకు సచ్చారు!

నారా: కొట్టుకున్నారా? యెవరెవరు తాతా?

తాత: (విన్పించుకోకుండా) హు! కళ్ళు మూసుకుపోయేఁ తినందరక్క— కొట్టుకు సచ్చేదీ! యింకేంపనులుంటాయి ఇంతకన్నా! ఛఛ!!

నారా: అసలు ఎవరెవరికి తాతా పోట్లాట?

తాత: యింకెవరికి! ఆ మాలపేట పక్కనున్నాడే ఆ సుబ్బి గాడికీ, పెద్దిరెడ్డిగారి కొడుక్కీ. యేందో లేవయ్యా కాలమేమారిపాయె!! యెంత లేదన్నా మాకూనిండినయ్ అరవై యేళ్ళు. యిన్నాళ్లనించి సూత్తుండాము. ఎన్నడూ లేదయ్యా యింతయిపరీతం! ఏందో పెజా పెబుత్వమంటూ, పెజా పాలనంటూ!! ఏం పెజా సామికమో! హు!

నారా: యింతకీ అసలు ఏంజరిగింది తాతా?

తాత: ఆఁ! ఏమన్నా ఏంజరుగుతుంది — మట్టిమీద నెత్తురు.

నారా: ఆఁ! అందాకా వచ్చిందేమిటి?

తాత: రాక ఏమౌతుంది నారాయణా!! యింకా దేవుని దయతో అంతటితో ఆగిపోయింది కాని... అదొక అదృష్టమేలే. సరేగానీ తొందరగా రా వెళ్దాం. మన కోసం డాక్టరుగారు కాసుక్కూకొంటారు—

నారా: వస్తున్నా—వస్తున్నా. (లోపలికి వెళ్లి బయటికి వచ్చాడు) కాసేపుఆగు తాతా! సిరెంజివేడవుతునే వెళ్దాం.

తాత: సిరెంజా! అంటే?

నారా: అంటే సూదిమందు లేగానీ... అసలేంజరిగిందక్కడ?

తాత: ఆఁ! ఎవరో పెద్ద ఆఫీసరు వత్తుండాడని మన వూళ్లో వాళ్ళంతా నానా అగచాట్లు పడుతుండారుకదూ ఏందో మట్టిరోడ్డనీ, రాత్రి బడనీ - అదనీ యిదనీ యేందేందో తిప్పలు పడుతుండాల్లే. ఆ ఆఫీసరేదో మొదలు సేస్తాడంట నే!

నారా: అవును- ప్లానింగ్ ఆఫీసర్ అని ఓ పెద్ద ఆఫీసర్లే. ఆయనే మనం నిర్మించుకున్న ఆ మట్టిరోడ్డునీ, రాత్రి పాఠశాలనీ రేపు ప్రారంభోత్సవం చేస్తాడు.

తాత: ఏం వుత్సవమో ఏమో! దాని తలగాల! యిన్ని మందులు మాకులు కనిపెడ్తున్నారు, ఎన్నెన్నో సిత్ర విసిత్రాలు కనిపెడ్తున్నారు. పల్లెటూళ్ళను బాగు

సేసేది ఒక్కటి లేదుకదా!!!—

నారా: కాదు తాతా కాదు...పల్లెటూళ్ళు దేశానికిపట్టు కొమ్మలు.

తాత: ఏం కొమ్మలో-ఎండిపోయిన పట్టికొమ్మలు,... నేననేది అదికాదు నారాయణా!– పల్లెటూళ్ళు...

నారా: ఉండు తాతా! (లోపలకెళ్ళి Medical chest తీసుకొని వచ్చాడు) పదతాతామరి....

తాత: పదపద...(నిష్క్రమించారు.)

(తలుపువేసినచప్పుడు – లైట్లు తిరిగి ఆరిపోయినై – దూరంగా పోయిన మొదటి గీతం తిరిగి దగ్గరగావచ్చింది. ఈసారి బృందగీతంలా వుంది. స్త్రీలుకూడా తమ గొంతు కలిపారు - కాస్సేపట్లో తిరిగి లైట్లు వెలిగినై - బయట తలుపుచప్పుడు...గీతం దూరంగాపోయింది. లోపలికి నవ్వుకుంటూ ముగ్గురు వ్యక్తులు వచ్చారు - అందులో నారాయణా ఒకడు. Bag తో లోపలికివెళ్ళాడు.)

మొదటివ్యక్తి: (నవ్వు నాపుకుంటూ) కాదండీకాదు. మనం కూడా జంతు సంతతినుంచే యిలా అవతరించామని ముందే డార్విన్ నిరూపించేశాడు.

రెండవవ్యక్తి: మీ రలాఅంటే ఏమనేది చెప్పండి. ఎంత మనం జంతు సంతతికిచెందినా చదువుకున్నందుకు మనలో కొన్నైనా నాగరిక లక్షణాలున్నా యికదండీ. కానీ యీ......

మొదటి: పల్లెటూరి ప్రజల్లో యింకా జంతు లక్షణాలు పోలేదంటారు మీరు...అంతేనా?

రెండ: **Exactly.** పల్లెటూరి మోటు రకాలంటే యేమనుకున్నారుమరి?

మొదటి: **No.** నేను ఒప్పుకోను...

(బయట్నుంచి లోపలికి ప్రవేశిస్తూ గోవిందం పంతులు.)

గోవిం: నమస్కారమండీ డాక్టరుగారూ!

డాక్టరు: ఓ! గోవిందంగారా? రండి పంతులుగారూ!

గోవిదం: నమస్కారమండి రజనీ కాంతంగారూ!

రజని: నమస్తే నమస్తే!

గోవిం: ఏమిటో సమస్యాచర్చలో పాల్గొన్నట్లుందే!

డాక్టరు: ఆఁ!...ఏదో కాలక్షేపానికి.

రజని: గోవిందం పంతులుగారూ!

గోవిం: అయ్యా!

రజని: రమణ రాలేదేం?

గోవిం: వస్తున్నాడండీ—

డాక్టరు: సరేగానీ రజనీ నీవు విలేజ్ లెవెల్ వర్కర్ గా యీ ఊరు వచ్చి యెన్నాళ్ళైంది?

రజని: సరిగ్గా రేపటికి ఆర్నెల్లు.

గోవిం: నేను చెప్పనాండీ! ఎల్లుండి సోమవారం బహుళ పాడ్యమి నాటికి ఆ రేండ్ల ఏడు నెల్లవుతుంది నేనీ వూరికి టీచరుగావచ్చి. ఉన్నమాట చెప్పొద్దూ!

రజని: ఏం! ఎందుకలా అడిగారు?

డాక్టరు: ఊఁ! యేం లేదు...వూరికేనే. యెన్ని నెల్లయిందో మీరీవుద్యోగంలో చేరి అని—

రమణ: (ప్రవేశిస్తూ) good evening Sirs! ఏమిటో వుద్యోగాలసి గురించి మాట్లాడుతున్నట్లున్నారు. నేను సోషల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజర్ గా చేరి యీ దినానికి రెండేళ్ళ తొమ్మిది నెల్లయింది. అదేనాండి మీరడిగేది?

డాక్టరు: అవునవును...సరిగ్గా అదే అనుకుంటున్నాం.

రమణ: ఏమిటీ?

డాక్టరు: ఊఁ!...మన రజనీకాంతం విలేజ్ వెల్ఫేర్ వర్కర్ గా ఆరు నెల్లనుంచీ కృషి చేస్తున్నాకూడా, యీ గ్రామ ప్రజలమనస్తత్వాల్ని అర్థం చేసుకోలేక పోయామేఁ అని..

రజని: ఏమున్నాయండీ అర్థం చేసుకోలేనంతటి మహా మనస్తత్వాలు! తెలియక అడుగుతా కాని— మనచావుమన మేదో చచ్చి రేపటి ప్రారంభోత్సవానికి నానా అగచాట్లుపడి ఆ వినోద ప్రదర్శనలూ అవి ఏర్పాటు చేసుకుంటున్నాంకదూ- వీటితో ఆ సుబ్బిగాడి కేంపని?

పోనీ నాటకం చూడ్డానికి వచ్చాడనుకొందాం. ఊరికే వున్నాడా? తాగి తందనాలాడటం. పెద్దిరెడ్డిగారి కొంపకి ఒళ్ళు శివమెత్తటం. దీంతో ఒకరినొకరు తన్నుకోటం...బుర్రబద్దలు కొట్టుకోటం...ఇవి గదండీ అర్థంగావిమన స్వర్గాలు? ఇవేగదండీ నాగరికతా చిహ్నాలు! ఇవేగదండీ భారతదేశ ఔన్నత్యానికి పట్టుకొమ్మలు?

డాక్టరు: రజనీ! స్నటికైనా, నేటికైనా, రేపటికైనా, భారతదేశ సౌభాగ్యం పల్లెటూళ్ళమీదనే ఆధారపడిందన్న మాట మాత్రం మరచిపోకు.

గోవిం: కాని ఒక్క విషయం డాక్టరుగారూ! పుస్తకాలలో చదివినంత గొప్పగా అమాయకంగా లేవండీ పల్లెటూళ్ళు. ఉన్నమాట చెప్పొద్దూ, నేనూ అలాగే ననుకొని చాల మోసపోయేనండీ!

రజని: నేనీ అజ్ఞానుల మధ్య విసిగిపోతున్నానండీ!

డాక్టరు: పంతులుగారూ!....గ్రామసేవకులుగా నియమింపబడిన మీరు యీవిధంగా మాట్లాడటం సముచితంగాలేదు.

రమణ: ఉచితానుచితాలైతేనాకు తెలియవుగానీ డాక్టరుగారూ— ఒక్క విషయం చెప్పనా! మనం ఎన్నో అభివృద్ధి ప్రణాళికలు నిర్మించుకోవచ్చు. కాని వాటిని కార్యక్రమరూపాన ఆచరించటం కష్టం. యింకా నాగరికత కల్గిన పట్నవాసాల్లో నయినా యీ ప్రణా

ళికలు సఫలం కావచ్చుకాని, యీ పల్లెటూళ్ళలో మాత్రం అసాధ్యం.

డాక్టరు: రైట్. చాలా కరెక్ట్‌గా చెప్పావు...కానీ... (అంటూ అటువైపుచూచి) ఓ...పెద్దిరెడ్డి గారా!... రండిరండి. (పెద్దిరెడ్డి ప్రవేశం...)

డాక్టరు: ఆఁ! అబ్బాయికి నిద్రపట్టిందా!

పెద్దిరెడ్డి: (కూర్చుంటూ) ఊఁ! నిద్రపోతున్నాడు. ఇదేమంత ప్రమాదకరమైన గాయంకాదు కదండీ డాక్టరుగారూ!

డాక్టరు: ప్రమాదకరమైన గాయంకాదనుకోండి. అయినా నాలుగైదు రోజులు అబ్బాయిని కనిపెట్టుకొనుండాలి.

పెద్దిరెడ్డి: అంత అపాయ కరమాండి?

డాక్టరు: ఉహుఁ! అపాయమనిగాదు. పోనీ మీ చిన్న కుర్రవాడు వెంకట్రామిరెడ్డిని అబ్బాయిదగ్గరే వుంచకూడదూ దేనికైనా సహాయంగా వుంటుంది.

గోవిందం: రెడ్డిగారికి కోపం రాదనుకుంటాను...

పెద్దిరెడ్డి: అబ్బే-నాకెందుకూ కోపం!

గోవిందం: మీ చిన్న కుర్రవాడు వెంకట్రామి రెడ్డి బడికి వారం రోజులు నుంచి బొత్తిగా రావటంలేదండి!

పెద్దిరెడ్డి: మా వాడేనా! అందరూ రావటం లేదా?

గోవిందం: ఇంట్లో కుర్రాళ్ళందరూ బడికని బయల్దేరటమేమో సబబుగానే వుంవండి. కాని బడికి రావటం మానుకుని బయట ఏవేవో చేస్తుంటారండి.

రమణ: మరిమీరావిషయం వారితో చెప్పనక్కర్లేదూ?

గోవిందం: రామరామ... చెబితే అంటారూ... పిల్లలు బడికి రావటమనేది టీచర్లపై ఆధారపడింది అని. పోనీ పిల్లకాయల్ని బడికి రప్పిద్దామా అంటే మాబాబు వద్దన్నారండి అంటారు. ఎలాగండీమరి యీవుద్యోగం చేసేదీ?

రమణ: మరి యిన్నాళ్ళనుంచీ ఎలాచేస్తున్నారు?

గోవిందం: ఏముందీ... బళ్ళోకిరాగానే వొడ్డిగుమ్మాన్నాను కొని గోడప్రక్కనున్న వేపచెట్టుక్రింది పాత నులక మంచం ఆహ్వానిస్తుంది... సరే... జీవితంలో మేలుకొని వుంటే ఏదోపని చేస్తూవుండాలి. ఆ చేయవలసినపని ఏదీ లేనప్పుడు గుర్రుపెట్టి నిద్రపోవటమే మాంఛిపని...

రమణ: ఏమిటీ! బళ్ళో నిద్రపోతారా?

పెద్దిరెడ్డి: ఏం చేస్తారండీ నిద్రపోక! పాఠం చెబుదామంటే పిల్లలుండరు. పిల్లల్ని బడికి పంపాలంటే మాకుకష్టం, అయిష్టం కూడా...

రమణ: బళ్ళో చదువుకోవడానికి పంపటం మీ కయిష్టమా?

పెద్దిరెడ్డి: కాకపోతే ఏమిటండీ— మీ చదువులికి మాపిల్లల్ని పంపితే యిహ రేప్పొద్దున నాగలిపట్టేకొనేదెవరూ అని?

రమణ: అంటే?

పెద్ది: అంటే ఏముందండీ! రైతుపిల్లల్ని యింగ్లీషు చదువులు చదివిస్తే యింక పల్లెల్లో వ్యవసాయం చేసేదెవరూ?

రజని: చూశారా డాక్టరుగారూ! ఎంత అవివేకమో?

పెద్ది: ఏమయ్యోయ్. వివేకం అవివేకం యెంచుతున్నావ్. మాకూ తెలుసునయ్యో అర్థాలు... లేకపోతే మీ యింగ్లీషు చదువులు ఎందుకు పనికొస్తాయయ్యో. ఇంకా కాస్త చదివేసరికి అయ్యగారికి నెత్తిమీది కొస్తాయికళ్ళు.

రజని: నేననటం అదిగాదండీ! మీరు అలా...

పెద్ది: ఏమిటండీ అనేది. పెద్ద చెప్పొస్తావ్. మీకు వ్యవసాయంగురించి ఆవగింజంతైనా తెలుసాఅని ... పుస్తకాల్లో రాసింది చెప్పటం కాదయ్యోవ్...గోచెగ్గట్టి పనిచేస్తే తెలుస్తుంది.

గోవిందం: వాళ్ళకు మీలాగాగోచీల్లేవండీ..(బాజర్లు(బాజర్లూ!

పెద్ది: లేకపోతే ఏంటండీ వీళ్ళు చేసేపని...... (రజనివైపు చూస్తూ) ఈయనేదో భూసారమనీ యెముకల పొడి అనీ - అదనీ యిదనీ చెప్పి, మాకవన్నీ సరిపోవన్నా వినిపించుకోకుండా వేయించె- చేలన్నీ నాశనమాయె.

పోనీ అంతటితో వూరుకున్నారా? మళ్ళీ ట్రాక్టర్లు పెట్టి దున్నమంటారు. మీరు చూశారుగదూ! మనప్రక్క పల్లెల్లో ట్రాక్టర్లతో దున్నితే ఏమయిందీనూ! ఏంటో మాట్లాడతారు పెద్ద తెలిసినట్లుగా ... మీకన్నా తెలియకపోతే మమ్మల్ని అడగండి చెబుతాం. అవి రాసుకుపోయి మీరు నేర్చుకోండి. (విసురుగా సర్దుకుంటాడు.)

(కరణంగారి ప్రవేశం. రావటంతోనే)

కరణం: పెద్దిరెడ్డిగారూ! మీ అబ్బాయి మిమ్మల్ని కలవరిస్తున్నాడటండీ. మిమ్మల్ని రమ్మన్నారు.

పెద్దిరెడ్డి: మరి డాక్టరుగారూ... నేను వెళ్ళనా అండి?...

డాక్టర్: మంచిది వెళ్ళిరండి.

పెద్దిరెడ్డి: (వెళ్ళిపోతూ)యిదేమీ దుర్లక్షణం కాదుగదండీ...

డాక్టర్: అబ్బే కాదండీ!

(రెడ్డి వెళ్ళాడు)

కరణం: అందరూ కలిశారే ఒకేసారి!

రమణ: కూర్చోండి కరణంగారూ!

డాక్టరు: ఏమిటండీ విశేషాలు?

కరణం: ఏమున్నాయండీ...! ఉదయమే ఎన్నిగంటలకో... తెలుసుకు పోదామనీ...

డాక్టరు: ఏమిటి? ప్రారంభోత్సవమా? 7-30 కని నిర్ణయించు కున్నాంగదా!

కరణం: 7-30 కా! నాకు వీలు అవుతుందా బ్బా!

డాక్టరు: ఏం!

కరణం: మావాళ్ళు బయట చేరారండీ... ఉదయమే కాఫీ యిత్యాదినిత్యకృత్యాలన్నీ 7-30 కేపూర్తవుతాయాని?

డాక్టరు: పోనీలెండి! యీపూటకు కాఫీ-టిఫిన్ మా యింట్లో చూద్దాం గాని...

కరణం: డాక్టరుగారూ! ఎంత ఆచార భ్రష్టుడినైనా...ఏదో బ్రాహ్మణుడినై పుట్టాను గదండీ...

రజని: మీరు ఆచార భ్రష్టులా? బ్రాహ్మణత్వం మొత్తం మీలో మూర్తీభవించి వుంటే....మీరేనా ఆచారాలని అతిక్రమించేది!

కరణం: ఆసంగతి మీరిప్పుడైనా గ్రహించినందుకు వెయ్యి నమస్కారాలు బాబూ! ముందుకైనా పనికొస్తుంది యిలా తెలుసుకోవడం.

రజని: ఏమిటో మీరంటున్నదినాకర్థం కావడంలేదు.

కరణం: అదికాదండీ! శుభ్రంగా ఉండాలంటూ, ఆ మాల మాదిగ పేటలన్నీ పుడ్చేపని యిహానుంచైనా నాకు తగల కట్టకుండా వుంటారేమోనని...?

రజని: మాల మాదిగలంటే అంటరానివారు కాబోలు...

కరణం: కాబోలేమిటి? నా బొంద! మా నాయనగారి కాలంలో మాలవాళ్ళు మా యింటికెంతో దూరంగా నడిచేవారు. మా తాతగారి కాలంలో మా యింటి దరిదాపుల్లో ఎక్కడా మాలమాదిగ అన్నమాట ఎక్కడా వినబడకుండా వుండేది....అంత ఆచార పరాయణులు వాళ్ళు! ఇహ మాకాలంలో- దాని తాడు తెగ! మాలవాళ్ళు మా వీధికి రాకపోయినా మేం వాళ్ళవీధులకిపోయి వ్రాడ్చేకాలం వచ్చింది...శివశివా ఎంత ఆచార భ్రష్టత్వం వచ్చిందిరా నాయనా...

డాక్టర్: ఆచారాల్లో ఏముంది కరణంగారూ! మనపూర్వులు ఆచారాల పేరిట ఆరోగ్యాన్ని, పాపభీతి ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఆనాటికి ఇవి సాధనాలయినాయంతే...

కరణం: అలాగనుకోబట్టేనండీ యిప్పటికే నేనుసగం భ్రష్టుణ్ణయిందీ!

రమణ: పోనీ...బొత్తిగామీరు ఆచారాల్ని వదిలేస్తేనో!

కరణం: చచ్చిపోయినప్పుడే మరచిపోయేది.

రమణ: అలాఅంటే ఎలా చెప్పండి!

కరణం: ఏంచెప్పడంసార్! ఏదో రోడ్డు వేయాలని, శ్రమదానమనీ చెబుతే—శ్రమదానమంటే యెలాగుంటుందో చూద్దామని రోడ్డు దగ్గర కొస్తే, అంతమంది కూలి

వాళ్ళు ముందర, అదీ తక్కువజాతి మనుషులం దరి యెదుటవాళ్ళతో బాటు నన్నూ మన్ను మోయ మంటి రే! గ్రామ కరణాన్నైనందుకు చేయవలసిన మర్యాదేనాయిది! ఏమిటో మాట్లాడుతారు పెద్దగా—

రజనీ: ఇగ్నోరెన్స్!

రమణ: నో నో- యిన్నోసెన్స్!!

కరణం: ఏమిటో నాలుగు యింగ్లీషు ముక్కలు మాట్లాడితే సరిపోతుందనుకున్నారేమో! యిలాంటివాళ్ళను చాలా మందిని చూశాం. సరే మీతో నాకేంపని! ఏమండీ డాక్టరుగారూ! వస్తానండి—మావాళ్లు బయట చేరారు కదూ! వస్తా.

(కరణం వెళ్తాడు)

డాక్టరు: (నవ్వుతూ) బాగానే జరిగింది! ఏం మిత్రులూ! యేమంటారిప్పుడూ?

రజనీ: వస్తామండీ!

డాక్టరు: ఎక్కడకు?

గోవిందం: ఇళ్ళకు. యేం బాబూ! మేమేం నిద్ర పోనక్కర్లేదనుకున్నావేమిటి? రాత్రిళ్లు మేలుకుంటే ఆరోగ్యం చెడుతుందని పిల్లలకు పాఠాల్లో చెబుతుంటాను. కానీ నేనుమటుకు...

[కాంపౌండర్ నారాయణ బయటనుంచివచ్చాడుహడావుడిగా]

నారా: బాబుగారూ! బాబుగారూ!! మాలపేట అంతా దగ్ధమై పోతోంది.

డాక్టరు: ఆఁ! (లేచాడు)

గోవిందం: ఏమిటీ!!అబ్బ... ఆ కంగారువదలి కాస్త నిబ్బరంగా చెప్పవోయ్ యేంజరిగింది?

నారా: ఏంజరిగిందంటారేంటండీ!... మాలగూడెం మొత్తం కాలిపోతోంటే.

రమణ: దేనికి?

రజని: ఎందుకని అలా జరగటం?

డాక్టరు: అవును నారాయణా! ఎవరుచేశారీపని?

నారా: ఎవరేమిటి డాక్టరుగారూ! పబ్లిగ్గా అందరికీ తెలుస్తూనే వుందిగా- ఆ మాల సుబ్బిగాడికీ, పెద్దిరెడ్డిగారికొడుక్కీ సాయంకాలం ఏదో పోట్లాట జరిగిందటగా?

రజని: అవును! అది మామూలుగా జరిగింది?

నారా: ఆ పోట్లాటతో పెద్దిరెడ్డిగారు రెచ్చిపోయి...

గోవిం: మాలపేట గుడిశల్ని తగుల పెట్టించాడు. అద్దీసంగతి!

డాక్టరు: ఆఁ!? పెద్దిరెడ్డి స్వయంగా నిప్పంటించాడా?

నారా: గుడిశ లంటుకొనేసరికి మాల జనం గొల్లుమన్నారు పాపం!...

రమణ: మేం వెళ్తామండీ!

డాక్టరు: ఎక్కడికి?

రమణ: మాలగూడానికి. కాస్త వెళ్ళి అక్కడ మంటలార్పటం.. ఫస్టెయిడ్ అవీ చేద్దామనీ...

డాక్టరు: (చిన్నగా నవ్వి) రమణగారూ- మీరు అలా వెళ్ళ కూడదు.

రజని: ఏమిటండీ డాక్టరుగారూ! దేనికని?

డాక్టరు: అంతే. అదలాగే! మీరా మంటలార్పటానికి వెళ్ళటం యేమాత్రం బాగుండదు.

రజని: మరి మా బాధ్యత...

డాక్టరు: అవన్నీ తర్వాత ... యిలా రా నారాయణా!
(నారాయణా, డాక్టరూ బయటికి వెళ్తారు.)

గోవిందం: నేను చెప్ప లేదటండీ- మాట మాట్లాడితే గొంతు మీది కేననీ...

(డాక్టరు తిరిగి వస్తాడు)

రమణ: డాక్టరుగారూ!

డాక్టరు: (ఆలోచిస్తున్నాడు. పలుకడు)

రమణ: డాక్టరుగారూ! యెన్ని పుస్తకాలు చదివినా, యెవ్వరి నోటినుండివిన్నా, పల్లెటూళ్లు దేశానికిపట్టుకొమ్మలూ పల్లెప్రజలుఅమాయకులూ అంటుంటారే యెప్పుడూ... ఏమిటిది?

డాక్టరు: ఏం! అటువంటిదేమీ యిక్కడ కన్పించటం లేదనా?

రమణ: ఉహుఁ! కన్పించకపోవటంకాదుగాని, చెబుతున్నంత అమాయకత్వం పల్లెల్లో లేదండీ!

డాక్టరు: ఇంతకుముందుండేది. ఇప్పుడా అ మా య క త్వం, అజ్ఞానంగా మారిపోయింది. సగం తెలుసు, సగం తెలి యదు. ఆస్థితిలో వున్నారు. కాకపోతే ఏమిటిది! రేపు ప్రొద్దున్నే జరుగబోయే కార్యక్రమ మేమిటి? ఇప్పుడు యిలా గుడి శెలంటుకోవడ మేమిటి?

రజని: యిలాటి ప్రజలతో చేయికలిపి పనిచెయ్యటమన్నది బహుకష్టం.

రమణ: వారి మనస్తత్వాలను చూసి జాలిపడాలిగాని, యేవ గించుకో కూడదు గదండీ!

డాక్టరు: ఆఁ...ఏం చేసినా, యే బాధగలిగినా, ఎంతవిషమపరిమా ణాలు యేర్పడినా మనం చేస్తున్నది గ్రామాన్నత్యం కోసం. మనం ప్రతిజ్ఞ చేసింది దేశసౌభాగ్యంకోసం.

రమణ }
రజని } డాక్టర్!!

డాక్టరు: వ్యక్తిత్వ సౌఖ్యాలను మరచిపోవాలి సమష్టి సౌక ర్యాలకోసం. మానవత్వ విలువలకు ప్రా ము ఖ్య త. నివ్వాలి గ్రామాభ్యుదయ సాధనకోసం——

రమణ: గ్రామకల్యాణంకోసంకు శాయశక్తులా పాటుబడదా మనే మా ప్రయత్నమల్లా- అయితే యింత అగమ్యా

మైన మనస్స్వభావాలతో పొత్తుకుదుర్చుకొని కృషి చెయ్యటానికి కొద్దికాలం ఆలస్యం అవుతుందేమో!

డాక్టరు: అదే నేనంటున్నది. పచ్చని కొమ్మలతో విరియబూచిన చెట్లకు నీరుబోయటం కాదు రజనీ ప్రాముఖ్యం. ఎండిపోయి శల్యావస్థలోనున్న మ్రోడులను చిగురింప చేయుటం మీ ప్రయోజనం. దానికి ఒక్కటే మార్గం...

రజని: ఏమిటది?

రమ: ఏమిటది డాక్టరుగారూ?

డాక్టరు: చెబుతాను. కాస్త జాగ్రత్తగా వినండి. సరిగ్గా పదేండ్ల క్రిందట జరిగినకథ. అప్పటికీ పంచవర్ష ప్రణాళికలూ, కమ్యూనిటీ ప్రాజెక్టులూ యింకా ఏర్పడలేదు. నిరక్షరాస్యత మ్రగ్గిపోతున్న పల్లెటూరి ప్రజల విషమ పరిణామాల్ని, అజ్ఞానాంధకారంలో యెటు తోచక నానా అవస్థల పాలౌతున్న పల్లెటూళ్ళ దుర్భర జీవితాల్ని, రాజరావ్ అనే ఒక ఆదర్శవంతుడైన డాక్టరు కళ్ళారా చూశాడు. పల్లెప్రజలను భావి సౌభాగ్యవంతుల్ని చెయ్యడం తన జీవిత లక్ష్యం అనుకున్నాడు. పట్నంలో వేలకువేలార్జించే వుద్యోగాన్ని విడచిపెట్టి, యిలాంటి పల్లెటూరే చేరాడు. గ్రామీణుల సౌఖ్యం కోసం రాత్రింబవళ్ళు కృషిచేసి గ్రంథాలయం, స్కూలు, పోస్టాఫీసు, యిలాటి సౌకర్యాలెన్నో కల్పించాడా పల్లెకు. ప్రజాసేవకు అతని జీవితం అంకితం చేశాడు...

ఒకనాడు——

[లైట్లారిపోయి.క్షణంలో తిరిగి వెలిగినై]

[రాజారావు డాక్టరుగది- డాక్టరు పేపరుచదువుకుంటున్నాడు- వెంకటరెడ్డిఆయాసంతో ఉద్వేగంగాపరుగెత్తుకుంటూవచ్చాడు.

వెం: రాజారావుగారూ! రాజారావుగారూ!!

డాక్టరు: ఓ... వెంకటరెడ్డిగారా!... ఏమిటి యిలా...

వెం: విషయాలన్నీ తరువాత చెబుతాను డాక్టరుగారూ... మీరు వెంటనేబయలుదేరిరండి...... మా తమ్ముడికి బలంగా కత్తిపోట్లు...

రాజా: ఏమిటి? రామిరెడ్డికా? కత్తిపోట్లా? యెవరుపొడిచారు?

వెం: యింకెవరు ఆ శేషయ్యగాడే...పిరికిపంద...ప్రక్కనుండి పొడిపించాడు...

రాజా: ఆఁ... శేషయ్యగారా?!!

వెం: ఆఁ! వాడే! యిన్నాళ్ళనుంచీ నేననుకుంటూనే వున్నా నేనంటే వాడికి సరిపడటంలేదని-

రాజా: అసలు వెంకటరెడ్డిగారూ ఎందుకిలా జరగటం!

వెం: ఏడుపుకుళ్లునాయాళ్లు. ఒకళ్లుపైకొస్తుంటే ఏడ్చిచస్తారు.

రాజా: మీరు పైకిరావడం, ఆ శేషయ్యగారు దిగిపోవడం, ఏముంది యేడ్వటానికి?

వెం: యెంతకావాలండీ యేడ్వను! మొన్న మీరారాత్రిబడిని

నాతో ప్రారంభోత్సవం చేయించారా! అప్పట్నుంచే వాడికి కన్నుకుట్టింది.

రాజా: ప్రారంభోత్సవమంటే యెంతో పెద్దగౌరవమనీ, అది తనతో చేయించకుండా మీతో చేయించాననా?

వెం: అదే అయ్యుండవచ్చు— రండి డాక్టరుగారూరండి... వాడి పని యిప్పుడేముంది? యీ వూళ్లో వాడయినా వుండాలి, నేనయినా వుండాలి ఈ వెంకటరెడ్డిఅంటే ఏమనుకున్నాడో...! రండి...

రాజా: మీరు పదండి రెడ్డిగారూ! ఇప్పటికే ఆలస్యమయింది. వెళ్ళి హాల్లోకి చేర్పించండి. నేనిప్పుడే మందులు సర్దుకొని వస్తాను...అన్నట్లు కత్తిపోట్లు ఎక్కడా?

వెం: (పక్కలుచూపుతూ) ఇక్కడ... రండి తొందరగా- (నిష్క్రమణ)

రాజా: రామస్వామీ...! (వచ్చాడు) వెళ్ళి ఆ వెంకటరెడ్డిగారి తమ్ముణ్ణి హాల్లోకి చేర్పించి, అక్కడేవుండు. నేనిప్పుడే మందులు సర్దుకొని వస్తున్నా.

రామ: అలాగే (వెళ్లాడు)

(డాక్టరు లోపలికివెళ్ళి Stethoscope, Medical chest తో కూడా వెళ్ళబోతుండగా అడ్డంగా యెవరో యెదురు వచ్చారు.)

రాజా: (నిర్ఘాంతపోయాడు) ఆఁ! శేషయ్యగారా!

శేషయ్య: (వికటంగా నవ్వి) ఏం డాక్టరుగారూ! అలావున్నా రేం?

రాజా: ఎలా వున్నాను! బాగానేవున్నా నే!

శేషయ్య: ఎక్కడికో వెడుతున్నట్లుంది?

రాజా: యెక్కడికన్నా యెక్కడికి! బయటపల్లోకి-

శేషయ్య: యెందుకో?

రాజా: కత్తిపోట్లుతగిలిన పేషెంటు ఒకడు బయట వున్నాడు. యెలావుందో చూద్దామని...

శేషయ్య: వీల్లేదు. (గద్దించాడు)

రాజా: వీల్లేదా? (అణగిపోయిన గొంతుతో) రోగులకోసమే నేనున్నది. అది నాధర్మం.

శేషయ్య: అవును. అది మీధర్మం. ఇది మాధర్మం. అంతే. మీరా వెంకటరెడ్డి తమ్ముడి దగ్గరకు వెళ్ళటానికే మాత్రం వీల్లేదు.

రాజా: అయితే అతనెలా బ్రతుకుతాడు?

శేషయ్య: హుఁ! బ్రతకాలని యెవరుకోరుతున్నారు?చావవలసిందే...

రాజా: శేషయ్యగారూ- నన్నుదయచేసి వెళ్ళనివ్వండి.

శేషయ్య: డాక్టరుగారూ! మిమ్మల్నింతవరకూ నేనెన్నడూ - దేనికీ అడ్డగించలేదు.

రాజా: తోటి సోదరమానవుడు బయట చావుబ్రతుకులమధ్య అల్లల్లాడుతూంటే వైద్యునిగావుండి వెళ్ళకపోవటంమానవత్వంగాదు.... కాదు శేషయ్యగారూ!

శేషయ్య: అవునండీ డాక్టరుగారూ! నేనూ చెప్పి చూశాను. వింటేనా?

డాక్టరు: ఏమిటి?

శేషయ్య: నేను వెంకటరెడ్డి తమ్ముడితో ఏమాత్రం జోక్యం కల్గించుకోకపోయినా, నిందనాపై బడింది. గామిరెడ్డి తనంతకు తాను క్రింద జారిపడ్డాడనీ, క్రింద యేదో యినుప ముక్క వుండటం వలన ప్రమాదమైందనీ నే నెంత నచ్చచెప్పినా విన్పించుకోకపోతే నేనేంచేస్తాను. నేనక్కడ సమయానికి వుండటంవల్ల యీనేరంనాపై రుద్దుతున్నాడు. సరే... ఎందాకవస్తుందో రానీ! నేనూ చూస్తాను వీడిసంగతి—

రాజా: శేషయ్యగారూ!?

శేషయ్య: అంతేనండీ- యీవూళ్ళో వాడైనావుండాలి. నేనైనా వుండాలి—— మాటల్లోసరిబుచ్చుదామనుకున్నాడేమో!

(యింతలో రామస్వామి బయటినుంచి వచ్చాడు)

రామ: డాక్టరుగారూ! చనిపోయాడు...

(శేషయ్య నవ్వుతూ జారుకున్నాడు.)

రాజా: చనిపోయాడా?! (శూన్యంలో చూస్తున్నాడు.)

(ఇంతలో వెంకటరెడ్డి వచ్చాడు. రాజారావు అతణ్ణి చూడలేక చప్పునలోపలికెళ్లాడు. వెంకటరెడ్డిముఖం గంభీరంగా భయంకరంగా వుంది)

వెం: డాక్టరుగారూ!... మీరు రాలేదు...... చనిపోయాడు
నా తమ్ముడు-నాతమ్ముడు చనిపోయాడు...రాలేదు
మీరు...రా...లేదు...... (దుఃఖావేశం)

(ఇంతలో రామస్వామివచ్చాడు)

రామస్వామీ!... యింటాక యెవ్వరైనా డాక్టరుగారి
దగ్గరకు వచ్చారా!?... చెప్పు రామస్వామీ!...
రామస్వామీ- చెబుతావా లేదా?(గద్దించాడు)

రామ: (భయంగా) అదే— ఆ...శే...ష...య్య...

వెం: (హుంకరించాడు) ఆ! వాడొచ్చాడా ! అయితే యిం
కేం!...వాడిదే యీ మద్దతు...డాక్టర్!...పాముతో
చెలగాటం చెయ్యాలనే?... మీ రిద్దరూ కలిసి నా
తమ్ముడి ప్రాణం తీశారు. నాతమ్ముడు చనిపోయాడు.
చనిపోయాడు నా...తమ్ముడు! ....
కానీ యీ వెంకటరెడ్డి యింకా బతికేవున్నాడు డాక్టర్!
(మరీ భీషణాకృతమైంది అతని ముఖం) రాజారావ్
డాక్టర్! రాజారావ్ డాక్టర్!! తెలుసుకుంటావ్!!

(వెళ్లిపోయాడు)

(రామస్వామి యింతలో లోపలికి వెళ్ళి వచ్చాడు. రెడ్డి వెనుకాతే

బయటికి వెళ్లాడు- యింతలో శేషయ్య పళ్లూ తాంబూలంతో వచ్చాడు.)

శేషయ్య: రాజారావుగారూ!...రాజారావుగారూ!!

రాజా: (లోపల్నుంచి వేగంగా వచ్చి) నాకోసమైనా మీరు రాకుండా వుండండి...బయటికి వెళ్లిపొండి...

శేషయ్య: మీరు ఎంతో సహాయం చేశారు. ... మిమ్మల్ని నేను మరువలేను... యివిగో...యివి తీసుకోండి...

రాజా: శేషయ్యగారూ! ప్రాధేయపడుతున్నాను ... మీ రిక్కడినుండి వెళ్ళండి.

శేషయ్య: వెళ్తానండీ డాక్టరుగారూ! వచ్చింది వెళ్ళటానికేగా... వూళ్లో రెండుపార్టీలు యేర్పడ్డాయి. మీరింతవరకూ నామాటవిని వాడికి మందూమాకూ యివ్వకపోవటం ఎంతో మేలుచేసినట్లయింది.

రాజా: నేను మీమాటవిన్నానా? నన్ను మీరే అడ్డగించారు. వెళ్ళనివ్వలేదు.

శేషయ్య: యేదో ఒకటి... వాడు చనిపోయాడు... అన్నట్లు రేపు ఏదో కేసూ- గీసూ పెడ్తాడట!!

రాజా: ఆ! యెవరు! వెంకటరెడ్డా? కేసుపెడుతున్నాడా!?

శేషయ్య: అలా భయపడతారెందుకూ అంతా మీచేతుల్లో వుంటే!? వెధవలు వాళ్లేంచేస్తారు... మీ సర్టిఫికెట్ ముందు...

డాక్టరు: సర్టిఫికెట్ యివ్వాలా? మోసం! దారుణం!!

శేషయ్య: (చిన్నగా వ్యంగ్యంగానవ్వి) సర్టిఫికెట్ యిచ్చినంత మాత్రాన మిమ్మల్ని మోసం చేసి దూరం చెయ్యం డాక్టరుగారూ! నా లోకి మీరూ వొకరు. మనం అందరమూ కలసి ఒక పార్టీగా వుంటే ఎవరెన్ని తగుల్తారో చూద్దాం.

డాక్టరు: శేషయ్యగారూ!......మర్యాదగా బయటికిపొండి. మరినాదగ్గర పార్టీ మాటలు ఎత్తకండి...

శేషయ్య: కోపం వచ్చినట్లుందే డాక్టరుగారికి!

డాక్టరు: నేను చెబుతున్నాను శేషయ్యగారూ! ముందుమీరు బయటికి వెళ్ళండి.

శేషయ్య: కోపపడినంతమాత్రాన లాభంలేదు. ఆలోచించుకోండి.

డాక్టరు: మర్యాదగా బయటికి వెళ్తారా లేదా? లేకపోతే గెంటించి వేయవలసివస్తుంది.

శేషయ్య: (వికటాట్ట హాసం చేశాడు) గెంటింపు - హు! ఎవర్ని ఎవరు గెంటిస్తారో చూస్తాను...ఊళ్ళోకానున్నించే ఎవర్ని ఎవరు గెంటిస్తారో నేనూ చూస్తాను డాక్టర్!! గుర్తుంచుకో... (నిష్క్రమించాడు. డాక్టరు కేంచేయాలో ఏమీతోచలేదు)

(రామస్వామి బయట్నుంచి వచ్చాడు)

రాజా: ఏంరామస్వామీ వూళ్ళో ఎలావుంది? !!

రాం: రెండు పార్టీలు యేర్పడ్డాయి బాబుగారూ! ఒకటి శేష య్యగారి పార్టీ, రెండవది వెంకటరెడ్డిగారిది. రెండు వైపులా తీవ్రంగా తన్నుకుంటున్నారు!

రాజా: ఆఁ! తన్నుకుంటున్నారా?!

రాం: అవునండి! యింకా ఎక్కువవుతాయేగానీ ఏమాత్రం తగ్గిపోవు— మధ్యలో డాక్టరుగారూ మీరు...

రాజా: ఏం ఆగిపోయావు? !...

రాం: ఏంలేదు...ఏంలేదు...ఉహు!

రాజా: ఏమిటి రామస్వామీ... ఏదో దాస్తున్నట్లుంది!

రామస్వామి: ఏంలేదులెండి... మీరు యిరువైపులా చేర కుండా వుండటం కష్టం బాబుగారూ...

రాజా: అంతేనంటావా రాంస్వామీ!!

రాంస్వామి: అంతేబాబుగారూ!—

రాజా: (వెంటనే జేబులోంచి ఒక కవరు తీసి యిచ్చాడు)

వెళ్ళి పోస్టుచేసిరా !

రాంస్వామి: డాక్టరుగారు క్షమించండి అడుగుతున్నందుకు— ఇదేమిటో నేను తెలుసుకోవచ్చా?

రాజా: నన్ను యీవూరినుంచి ట్రాన్స్‌ఫర్ చెయ్యమని పైవా ళ్ళకి వ్రాసుకున్న అర్జీ రామస్వామీ...

రాంసామి: ట్రాన్స్‌ఫర్ కోసం రాశారా? నిజంగా!!

రాజా: అవును...ట్రాన్స్‌ఫర్ చేయమనే వ్రాశాను.

రాంసామి: అయితేతొందరగా వెళ్ళి సంతోషంగా పోస్టు చేసివస్తా...(నిష్క్రమణ)

(లైట్లారిపోయినై — తిరిగి వెలిగినై.
కొన్నాళ్ళ తరువాత—
డాక్టరు గది)

(రామస్వామి బయట్నుంచి లోపలకు నీళ్ళు పట్టుక వెళ్ళాడు సీసాతో)

రాజా: (ప్రవేశం) రామస్వామీ! ఉత్తరాలేమైనా వచ్చాయా?

రామస్వామి: ఏదో ఒకటి వచ్చిందండి. (యిచ్చాడు)

రాజా: ఎక్కడనుంచో—(చదువుకున్నాడు.) డామిట్!

రామ: ఏమిటండీ డాక్టరుగారూ!

రాజా: ఏంలేదు రాంస్వామీ...ఏంలేదు!!

రామ: నాకు చెప్పకూడని విషయాలేమైనా వున్నాయేమో! మీరు దాస్తున్నట్లుంది.

రాజా: యిందులో దాపరికమేముంది రాంస్వామీ! ...దాపరికం ఏంలేదు. నన్ను ట్రాన్స్‌ఫర్...

రామ: చేశారా! భగవన్!!

రాజా: అంత భాగ్యం కూడానా! నన్ను ట్రాన్స్ఫర్ చెయ్యటానికి వీల్లేదని వ్రాశారు, ట్రాన్స్ఫర్ చెయ్యలేదు. చేయరు.

రామ: మిమ్మల్ని ట్రాన్స్ఫర్ చెయ్యలేకుకదండీ డాక్టరుగారూ! యెందుకు చెయ్యలేదో నాకు తెలుసు.

రాజా: ఎందుకు రామస్వామీ?...

రామ: యిన్నాళ్లూ చెప్పనందుకు క్షమించండి- యిప్పుడయినా చెప్పాలను కోవటంలేదు... చెప్పలేను...

రాజా: నా మేలుకోసమైనా చెప్పు రామస్వామీ.

రామ: అయితే చెబుతాను. మీకు ట్రాన్స్ఫర్ కాకుండా చేసింది వెంకటరెడ్డిగారే!

రాజా: వెంకటరెడ్డిగారా! నన్ను ట్రాన్స్ఫర్ చేయనీయలేదా!! ఎట్లా?

రామ: ఆరోజు మీరు ట్రాన్స్ఫర్ కోసం డిస్ట్రిక్టుబోర్డువారికి వుత్తరం వ్రాశారు. అది పోష్టుచేసివస్తున్నాను. దారిలో వెంకటరెడ్డి కనబడి మిమ్మల్ని నానామాటలూ అన్నాడు. శేషయ్యపార్టీలో చేరి తన తమ్ముణ్ణి మీరే చంపారనీ... యిలాగే యింకేవేవో అన్నాడు. నేను అంతటితో ఆపుదామని "ఆc! డాక్టరుగారి కేంపని మీ పార్టీలమధ్యనా. ఆయన వత్సరంలోనే ఇక్కడనుంచి

ట్రాన్స్ఫర్ కాబోతున్నాడుటే" అన్నాను. అతనికి శివమెత్తిందామాటతో-" ట్రాన్స్ఫర్ కోసం వ్రాసు కోవటానికి బోర్డులోవాళ్ళ తాతవున్నాడా? మా మామ వున్నాడనుకొన్నాడా? యెట్లా మార్చుకుం టాడో నేనూచూస్తా"నని యింకా యిలాగే యేవేవో ... డాక్టరుగారూ... నేను చెప్పలేనండి-

రాజా: పోనీ రాంస్వామీ చెప్పవద్దులే.

రామ: వెంకటరెడ్డిమామనే డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటు డాక్టరు గారూ!

రాజా: ఎవరో ఒకరు..నన్ను ట్రాన్స్ఫర్ చెయ్యనివ్వలేదు. సరే యీవూళ్ళోనే, యీ పార్టీలమధ్యనే, యెలాగో డాక్టరుగానే,ఉంటాను. యిక్కడేవుంటాను.

రామ: కాదండీ వుంటానికి వీల్లేదు. డాక్టరుగారూ మీరు యీ వూళ్లో వుండకూడదు.

రాజా: ఏం! ఎందుకని?

రామ: ఉండకూడదు డాక్టరుగారూ! పార్టీలుపూర్తిగా రగిలి పోయిన్నై. శేషయ్యగారు ఒకవైపున మీరు తనపార్టీ లో చేరలేదని మిమ్మల్ని ద్వేషిస్తున్నారు: మరొక వైపున రెడ్డిగారు మిమ్మల్ని ఆగర్భ శత్రువులుగా చూస్తున్నారు. రెండు పార్టీలవారికీ మీరు శత్రువులే బాబుగారూ! న్యాయానికి తావులేదు. మీరు వెళ్లి పొండి డాక్టరుగారూ...

రాజా: వెళ్ళిపోవాల్నా? ఎలా?

రామ: ఒకవేళ వున్నాకూడా- మీకు ప్రాణాపాయం తప్పదు.

రాజా: జరుగనీ రామస్వామీ! దేశసేవకు యెంతమంది ప్రాణాలు అర్పించలేదు- ఒకచిన్న యీ పార్టీలమధ్య నా ప్రాణం యెంత? నా ప్రాణం పోయిన తరువాత నైనా వీళ్ళు కలుస్తారేమో! అదేనాకు చాలు. పదివేలు.

రామ: అలాజరగదు డాక్టరుగారూ!! మీకన్నా అన్నిట్లో చిన్నవాడినైనా సాహసించి సలహాయిస్తున్నందుకు మన్నించండి, పల్లెటూరి పార్టీ మన స్తత్వాలు మీకు తెలియవు. అందరూ మీలాగే వుంటారనుకుంటారు. కనీసం యీ పల్లెటూరి క్షేమంకోసమైనా యీవూరు విడిచి వెళ్ళండి.

రాజా: నేను ఆశించినదొకటి జరుగుతున్నదొకటి-

రామ: అవును; చీకటిలో బ్రతికేవీరిని వెలుగుకు తీసుకవచ్చినా కూడా- అజ్ఞానంలో కుమిలే యీపల్లె ప్రజలని విజ్ఞానవంతుల్ని చేయటానికి కంకణం కట్టుకున్నాకూడా- మిమ్మల్ని గుర్తించలేకపోయారు. అభాగ్యులు... డాక్టరుగారూ! మీరెదురుగా వున్నకొద్దీ పార్టీలు తగ్గవు... సరికదా యింకా రగిలిపోతాయి. మా క్షేమంకోసమైనా మీరీ వూరువిడచివెళ్ళండి. వెళ్లిపొండి బాబుగారూ!!

రాజా: అలాగయితే సరే రామస్వామీ... వెళ్తున్నా... వెళ్తున్నా... (డ్రాయరుతీసి లెటర్ హెడ్ మీద ఏదో వ్రాస్తున్నాడు)

రామ: ఏమిటది బాబుగారూ?!

రాజా: రాజీనామా—ఇదిగో యిది వుదయమే పోస్టు చెయ్యి.

రామ: డాక్టరుగారూ!!!

రాజా: ఏం లేదు రామస్వామీ! నా డాక్టరుపనికి రాజీనామా యిచ్చాను. అంతే. సరేగానీ సామాను అవీ సర్దు. తెల్లవారకముందే వెళ్ళిపోవాలి...అబ్బా!

రామ: తల నొస్తోందాండీ... అలసిపోయారు ... నిద్రపోండి మీరు ... నేను చూస్తా మిగతాఁవన్నీ... (అంటూ లోపలికి వెళ్ళి మంచం తెచ్చి వాల్చాడు. పక్క వేశాడు)

రాజా: రామస్వామీ జీవితంలో నీమేలుమరువలేను. కాని మున్ముందు యీవూరు క్షేమసౌభాగ్యమంతా నీమీదే ఆధారపడింది. (కన్నీళ్ళు తుడుచుకున్నాడు)

రామ: వాటికేంలేగానీ డాక్టరుగారూ! ముందు మీరు పడుకుందురుగాని... రండి

రాజా: (కుర్చీనుంచి లేస్తూ) సామానంతా సర్ది పడుకో రామస్వామీ! నేనేమో పడుకుంటున్నా...మూడు గంటల కల్లా లేపు—

రామ: సరే...! (లోపలికెళ్లాడు. లైట్లారిపోయాయి)

—లోపల్నుంచి రామస్వామి—

డాక్టరుగారూ! ద్రోహులు-దుర్మార్గులు!! వస్తున్నారు. జాగ్రత్త......

(లైట్లు వెలిగాయి-డాక్టరుగారి గుండెపైన రెండు వైపులా రెండుకత్తిపోట్లు. ఈవైపున శేషయ్య-ఆవైపున రెడ్డి నిలుచున్నారు...)

రాజా: ఓ!మీరా!(యిద్దర్నీ చూశాడు)నన్ను చంపటంలోనైనా మీయిద్దరూకలుసుకున్నారు... నాఆత్మ తృప్తికలుగుతుంది.రెడ్డిగారూ!మీయిద్దరిమధ్య భేదాలుచాలాస్వల్పమైనవి... శేషయ్య నిర్దోషి. మీ తమ్ముడిని చంపలేదు... శేషయ్యగారూ!!నాఆత్మశాంతికోసమైనా మీయిద్దరూకలుసుకోండి...కలుసుకోండి....(కృశించాడు) రాంస్వామి! వెళ్ళిపోతున్నాను... వెళ్ళిపోతున్నాను. (క్రిందపడి పోయాడు)

(రెడ్డి శేషయ్యలు ఒకరి నొకరు చూసుకున్నారు-వెనుక నుండి నవ్వులు కఠోరంగా విన్పిస్తున్నాయి. డాక్టరుగారి మాటలుపదే పదే ప్రతిధ్వనిస్తున్నాయ్. ఒక్క సారిగా వాళ్లిద్దరూ కదలిపోయారు. నవ్వుల కఠోర కరాళధ్వనులతో వాళ్ళమానసాలు చలించినై-ఇద్దరు కలుసు కున్నారు. కవుగలించుకున్నారు.)

(లైట్లారి పోయాయి)

(మళ్ళీ లైట్లువెలిగినై.... మొదటిడాక్టర్ గది అంతర్నాటకానికిముందు ఎలా వున్నారో అలాగే వున్నారు.)

డాక్టర్: అలాజరిగింది. ఆ డాక్టరువాంఛ అలాగైనా నెర వేరింది...

రజని: డాక్టరుగారూ! కథ కళ్ళకు కట్టినట్లుచెప్పారు, నిజంగా పల్లెటూళ్లు అంతఅధ్వాన్నస్థితిలో వున్నాయని తెలిసినా నమ్మలేకపోయేవాళ్ళము. ఈరోజు నిజంగా కళ్లారా చూసినట్లేవుంది...పాపం- ఆ డాక్టరు ఆత్మబలి దానం చెయ్యవలసి వచ్చిందన్నమాట!!

డాక్టర్: స్వార్థత్యాగం అంటే అదే- విశ్వకల్యాణ వాంఛలో తనప్రాణాన్నైనా లెక్కచెయ్యలేదా డాక్టరు. ఇదే రమణా మీగ్రామసేవకులకు కావలసిన ముఖ్యవిషయం!

రమణ: డాక్టరుగారూ! కథవింటూంటే ఆరాజారావుమీారేనను కున్నానండి.

గోవిం: అయితే...గ్రామాభివృద్ధికోసం పాటుపడేవాళ్ళంతా యిలాగే ప్రాణాలర్పించాలా?

డాక్టరు: అవసరం వస్తే ప్రాణాల నెదురడ్డటానికి కూడా అధైర్యపడకూడదు. కాని...పల్లెప్రజల మనస్తత్వా న్ని అర్థంచేసుకొని అందుకను గుణంగా నడుచుకుంటే అంత అవసరంకూడారాదు.

రజని: మనస్తత్వాలా? అంటే!...

డాక్టరు: అంటే...అంటే... ఏం చెప్పను రజనీ!

రజని: ఏమైనా చెప్పండి డాక్టరుగారూ! మీరు చెప్పినకథ నాహృదయాన్ని మార్చేసింది. ఈ సంస్కృతిలేని ప్రజానీకాన్ని ఎలా మార్చాలి డాక్టరుగారూ! యీ పల్లెజలని సంస్కారవంతుల్ని చేయకపోతే యింకా ఎంతమందైనా యిలా బలికావలసివస్తుందే.

డాక్టరు: (నవ్వుతూ) రజనీ! సంస్కృతికాదు వీరిలో లోపించింది. కాలమానపరిస్థితులనర్థంచేసుకునే విజ్ఞానం. వారినందరినీ విజ్ఞానవంతుల్ని చేసే బాధ్యతమీది అని పదే పదే నేనటంకూడా బాగోలేదు కాని-ఏదో

(ఇంతలో కరణం ప్రవేశం)

కరణం: ఏమిటీ!-మీరంతా ఇక్కడేవున్నారేమిటి? రాత్రంతా మేల్కొన్నట్లుందే?

గోవిం: (రజనీవైపుచూస్తూ) టైమ్ ఎంతయింది నాయనా?

రజని: (వాచివంక చూస్తున్నాడు)

కరణం: ఇప్పుడే కోళ్ళుకూసినై —

డాక్టరు: (ఆదుర్దాతో) సరేగాని కరణంగారూ! మాలగూడెం సంగతి ఏమైంది యింతకూ?

రజని: గుడిసెలన్నీ మంటలపాలైనాయా?

రమణ: (నిట్టూరుస్తూ) పాపం...ఆ హరిజనుల సంగతేమిటి! ఎక్కడున్నారు?

(కరణం చిన్నగా నవ్వుతూ వుంటాడు)

గోవిం: (భయంగా) అమ్మోయ్! ఇందాకటి కథలోని శేషయ్యనవ్వ కాదుగదా అది!!

డాక్టరు: ఊఁ! ఏమయింది కరణంగారూ??

కరణం: ఏమవుతుందండీ! మీరేదో చెప్పారటగదా ఉదయం ప్రారంభోత్సవం చేసే ఆఫీసరుతో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ కూడా వస్తున్నాడని.

రజని: (ఆశ్చర్యంతో) నిజమాండి?...మీరు చెప్పారా?...

డాక్టరు: ఊఁ! తర్వాత?

కరణం: తర్వాతేముంది?"సర్కిల్ యిన్స్పెక్టర్ వస్తున్నాడు. ఆయన్ని చూడగానే మాలవాళ్ళంతా గగ్గోలు పెడతారు. అప్పుడు నన్ను నిజం చెప్పమని అడుగుతారు. నేను మీరే అంటించారని చెబుతాను" అని మీరు అన్నారట కదా డాక్టరుగారూ?

రమణ: డాక్టరు గారన్నారా? ఎప్పుడు?

డాక్టరు: ఊఁ! కానివ్వండి. ఏమయిందప్పుడు?

కరణం: ఆఁ! ఏమన్నా ఏమవుతుంది? మీరా మాటలన్నారని తెలియగానే పెద్దిరెడ్డికి ఒక్కసారిగా మూర్ఛపోయినంత పనైంది. ఏమనుకున్నాడో ఏమో, తానూ

తనబలగం అంతా మాలగూడెం వెళ్ళారు.

గోవిం: అమ్మో!...అంతపనీజరిగిందీ??? యింకేంమరీ!!

డాక్టరు: మీరాగండి పంతులుగారూ; ఆఁ? మాలగూడెం వెళ్ళి...

కరణం: వెళ్ళిచూసేటప్పటికి వాళ్ళఅదృష్టంకొద్దీ అప్పటికి ఒక్కగుడిశేమాత్రమే కాలిపోయింది. సరే- అయిం దేదో అయిందనుకొని మిగిలినవైనా కనీసం మళ్ళీ అంటుకోకుండా నీళ్ళు చల్లుతున్నారు,

డాక్టరు: (సంతోషాశ్చర్యాలతో) ఏమిటీ! ఇప్పటి వరకూ నీళ్లు చల్లుతున్నారా?

కరణం: మరేమిటనుకున్నారు. మాటలామరి వందగుడిశెలకు నీళ్లుచల్లటమంటే!!

రమణ: పాపం! ఎంతపనిచేశారు.

(పెద్దిరెడ్డి ప్రవేశం)

పెద్దిరెడ్డి: డాక్టరుగారూ! (చెప్పలేక తలవంచుకున్నాడు)

డాక్టరు: ఓ! పెద్దిరెడ్డిగారా! రండి, రండి

(కరణంఒకవైపు,రెడ్డిమరోవైపు,డాక్టరుకురెండుపక్కలా నిలుచునివున్నారు)

పెద్దిరెడ్డి: డాక్టరుగారూ! క్షమించాలినన్ను!!

డాక్టరు: ఏం దేనికి?

సావిం: అమ్మబాబోయ్ యిందాకటి కథ గుర్తుకొస్తోంది!

పెద్దిరెడ్డి: ఒక్క గుడిశెమాత్రం కాలిపోయింది. కావలిస్తే దానికయ్యేఖర్చు నేనుభరిస్తాను. రిపోర్టు మాత్రం చెయ్యకండి.

డాక్టరు: ఎవరితో?

పెద్దిరెడ్డి: పొద్దున్నే ఎవరొస్తున్నారటగదా సర్కిలువాళ్లు, ఆఫీసరుతోపాటు.

డాక్టరు: ఎవరూ రావటంలేదు ప్రారంభోత్సవము చేయటానికి వచ్చేఆఫీసరుగారు తప్ప-

పెద్దిరెడ్డి: (దెబ్బతిన్నట్లుగా) ఆఁ!! ఎవరూ రావటంలేదూ!!!

డాక్టరు: అవును! ఎవరూరావటంలేదు. చూడండిరెడ్డిగారూ! రేపొద్దున మనంపదో ప్రారంభోత్సవమని చేస్తున్నాం. మా గ్రామంకూడా దేశ పురోగమనానికి తోడ్పడుతున్నదని నిరూపించుకునేందుకు మనమీ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. అటువంటి సమయాన గ్రామంలో గుడిశె లంటుకొన్నాయనీ, అదీ ఒకరిపై ఒకరికి ఏర్పడ్డకక్షలవల్ల అలా జరిగిందనీ తెలుస్తే ఎంతనీచంగా, హీనంగా వుంటుందో ఆలోచించండి. అందువల్ల అలా సర్కిల్ యిన్స్పెక్టరు వస్తున్నాడనీ, ఆయనతో నేను రిపోర్టు చేస్తాననీ లేనిది కల్పించి చెప్పాను. అందువల్లనైనా మీరా మంటలార్పటంలో తోడ్పడుతారనే

ఆశతో—సరే అలాగేజరిగింది.... మీ చేతనే ఆపని చేయించినందుకు ఏమనుకోకండి రెడ్డిగారూ!...

పెద్దిరెడ్డి: అనుకోవడ మేముందిలెండి. మంచిపనే చేయించారు.

డాక్టరు: క్షమించాలి రెడ్డిగారు నన్ను.

పెద్దిరెడ్డి: అయ్యయ్యో...అంతమాటంటారేంటండీ...మీరే నన్ను క్షమించాలిగానీ...

గోపిం: డాక్టరుగారూ! గుడి శెలంటు కొన్నప్పట్నుంచీ మీరిక్కడేవున్నారుకదా! మరివన్నీ ఎప్పుడు చెప్పారండి?...

డాక్టరు: ఆఁ! అదా!... నేనూ నారాయణా బయటకు వెళ్ళామే అప్పుడేదో చెప్పి పంపించాలెండి-యిలాకూడా చేయవలసివస్తుంది ఒక్కొక్కసారి...ఏమంటారు రజనీ!

రజని: డాక్టరుగారూ! మిమ్మల్నేమనాలో తెలియటంలేదు. మీరు చేసిన యీ మహోపకారానికి మేం కృతజ్ఞులం. ఇన్నాళ్లూ పల్లెటూళ్ళంటే వున్న హేయమైనభావంతో వాటినర్థం చేసుకోలేకపోయాం. కాకపోతే వాళ్ళని నానావిధాలుగా నీచంగామాట్లాడాను. క్షమించండి. ఇకముందునుంచి భావిభారత సౌభాగ్యానికి పల్లెటూళ్ళను పట్టుకొమ్మలుగా చేస్తాం,

డాక్టరు: భగవంతుడనుగ్రహిస్తాడు రజనీ (వాచిచూసుకొని) ఆఁ! $5\frac{1}{2}$ అయింది. మరిమనం అంతా తయారు కావొద్దూ ప్రారంభోత్సవానికి!

రమణ: ప్రారంభోత్సవం! అందరూ విజ్ఞానమనుకుంటున్న చదువులు చదివినా, నాగరికుల మనిపించుకున్నా అజ్ఞానమనే గోడలతో నిర్మింపబడిన మా హృదయ సౌధాలకి నేడు ప్రారంభోత్సవం డాక్టరుగారూ!... పల్లెటూళ్ళంటే, పల్లెటూరి పరిజలంటే ఒకవిధమైన అసహ్యం, ఏహ్యాభావమూనిండిన మా చీకటి గుండె లలో నేడు ప్రత్యూష. మనం నిర్మించుకున్న ఈమట్టి రోడ్డూ, రాత్రిపాఠశాలకూగాదు డాక్టరుగారూ ప్రారంభోత్సవం! నిద్రలేకుండామాకుప్రబోధంపలికిన యీరాత్రికికాదు యీప్రత్యూష! మాకు. మాహృదయాలకు. డాక్టరుగారూ! ఆ జన్మాంతమూ మీ మేలుమరువలేం.

డాక్టరు: దేశ సేవకు నడుంబిగించలేక పోయినా కనీసం మీలాంటి యువకులనైనా చైతన్యవంతుల్ని చేయ గల్గినందుకు నాజన్మ సార్థకమైంది.

గోవిం: ఏదో లెండి డాక్టరుగారూ! యింతకూ నా అదృష్టం బాగుంది కాబట్టే వీళ్ళకీమంచిబుద్ధులు పుట్టాయి. లేకపోతే నాజీవితం ఎల్లప్పుడూ నిద్రలోనే మునిగి పోయేది. నేనువస్తాను డాక్టరూమరి...

డాక్టరు: అందరమూ వెళ్దాం. ఊఁ!(వాచీచూసి)టైమ్ అయింది రజనీ! బయల్దేరాలి. ఊఁ! రెడ్డిగారూ! బయలు దేరండి. ఆఁ! రమణా!! ఊరేగింపుకు ఏమీ లోపాలు లేవుగదా!

రమణ: ఏమున్నాయండి... ఇదివరకే ఏర్పాటుచేశాంగదా!

డాక్టరు: మరి...

అంతా: వస్తామండి. నమస్కారం. నమస్కారం...(అంతా నిష్క్రమిస్తారు)

డాక్టరు: (ప్రతినమస్కారం చేస్తుంటాడు)

— తెర —

45

మా వా రు

46

ఇందులో

కేశవరావు

సతి

యెంకమ్మ

పుష్ప

మేరీకాంత

మాలతి

M S. N. హోమ్

47

ఆంగ్ల ప్రభావం మనమీద... మంచికి మాత్రమే కాక చెడు పరిణామాలకి కూడా దారి తీసింది. అందులో ఉన్నత తరగతులకు చెందిన మహిళా జీవన విధానం పాశ్చాత్య నాగరికతా వ్యామోహాన, వెర్రితలలు వేసింది.

ఆ చిత్రణమే యీ నాటిక.

48

blank page

రంగం చీకటిగావుంది. చీకట్లోనిప్పుకణికెకన్పిస్తూం బంచే యెవరో రంగంపై వున్నట్లున్నారు.

లైట్లువెలిగినై. రంగంవిశదమైంది. అదిసామాన్య పంసారం గల యింటిముందు వసారా——

లైట్లు వేసి యెంకమ్మ నుంచుంది.

కుర్చీలో జేరగిలబడి కాళ్లుటేబులు మీదుంచి సిగరెట్లు కాలుస్తూ ఏదోధ్యాసలో కూర్చున్నాడు కేశవరావు——

యెంకమ్మ నలభై నిండిన ముత్తైదువు. కేశవరావు గారింటిలో పనికత్తె. ఉన్నంతలో శుభ్రంగావుంది. ముతుక చీరకట్టుకుంది. తలచిందర వందరగా వుంటమేగాక ముడు తలు పడ్డ ముఖం కావటంవల్ల పెద్దతనం కన్పిస్తోంది. చేతిలోని దుమ్ముదులిపే కుంచెతో కాసింత ముందుకు వచ్చింది——

యెంకమ్మ: బాబుగారూ!

(కేశవరావు చప్పున లేచినుంచున్నాడు నిశ్శబ్దంగా. ఓ నిట్టూర్పు గట్టిగా వదిలాడు. ఆలోచిస్తూకొంత దూరం వెళ్ళి–మళ్లీ టేబిలు దగ్గరకు వచ్చిడ్రాయరు్పు తీసిఏదో జేబులో వేసు కుంటూ——)

కేశవ: ఆఁ! యెంకమ్మా! సతితో చెప్పు—నేను మాలతివాళ్ల యింటి కెళ్తున్నా. గంటారెండుగంటల్లో తిరిగి వస్తా నని చెప్పు——!

యెం: అట్టాగే నండి. (కేశవరావు వెళ్లాడు.)

[యెంకమ్మ కుర్చీలూ బల్లా తులిపి– ఫ్లవర్ వేజ్‌న సరిదిద్దుతూ వుంది.

లోపల్నుంచి తొందర తొందరగా వచ్చింది సతి రుస రుస లాడుతూ——]

సతి: వారేరే!?

యెంక: యెవరమ్మా!!

సతి: యెవరేమిటి నీ మొహం!!– యెక్కడికెళ్లారు వారు?

యెం: బాబు గోరామ్మా? యిప్పుడే యెల్లారు——

సతి: ఎక్కడికనో?

యెంక: యేమో నమ్మా!——మాలతి గారంట యెవరో!– వాల్లింట్కెల్లారని సెప్పమన్నారు...

సతి: అన్నారూ! అంటారు. అంటారు...

యెంక: అనట మేంటమ్మా– యెల్లిపోతేనూ!

సతి: వెళ్తారు వెళ్తారు——ఎందు కెళ్లరూ! ... మగాళ్లు కదూ! యెక్కడికైనా వెళ్తారు!

యెం: అదేంటమ్మా?

సతి: లేకపోతే యేమిటే మరీ...మధ్యాహ్నంనుంచి ఒక టేపడి పిస్తూనన్ను!

యెం: అదీ మీ ఏడుపేమిటీ?!

సతి: ఏఁ!?

యెం: ఊహూఁ! బాబుగారేదో కులాసాగా కబుర్లు సెబుతుంటే మీరు నవ్వుతున్నారనుకున్నా నేనిందాకట్నుంచీ. సెప్పారు కాదేం మరి!

సతి: యేడిశావ్ లే!

యెం: లేవమ్మ గారూ, నిజం!- సరాసాలాడు కుంటూ, సంతోసంగా వుంటున్నారనీ-సంసారం సిలకా గోరెంకల్లా సౌక్యంగా వుందనీ- నేనెంత మురిసి పోయానమ్మగారూ!

సతి: అంత భాగ్యం కూడానా!—(గాద్గదికంగా) ఊహుఁ!...

యెం: మీకేమ్మా!! యేంతక్కువైందనీ— సక్కని సంసారం!! ......పక్కకి అడుగెట్టని జీవితం!! అందరికీ వస్తాం దాఅమ్మా మీలాంటి అదురుష్టం!

సతి: యెందుకో!...ఎన్నివున్నా యేంప్రయోజనం!? నిమిష నిమిషానికీ చీట్లాట పోట్లాటలైతే—

యెంక: అది మామూలే లెగండి! ఆలుమగుల్లూ అయినాక ఆ మాత్రం రుసరుసలూ, కిసకిసలూ, వుండకపోతే యెట్లామరి?

సతి: యెంతరుసరుసలైనా అవతలివాళ్ల బాధలూ గమనించాలి. యేం చేస్తే యేమౌతుందో ఆమాత్రం తెలుసుకో లేక పోతే సంసారాలు దేనికి? యిహ సంపాదనలు దేనికి?!

యెం: అవునే అనుకుందాం- ఆమాత్రానికే మనం దిగులు పడ్డం దేనికి! అయినా...యీ మగాళ్లు సేసేపనులకి యేమీ అర్థం వుండదమ్మ గోరూ!

(Phone మోగింది. సతి వెళ్ళి Receive చేసింది.)

సతి: హలో... ఎవరూ?- ఆఁ! యెవరు మాట్లాడుతున్నారంటారా!— ఆఁ!... ఇది డాక్టరు కేశవరావుగారి యిల్లండీ! వారు మావారే. ఊఁ! నేనూ...వారి...ఆఁ! అన్నట్లు మీరెవరూ యింతకూ?—ఆఁ! మాలతా!!...
(బొమముడి చిట్లించి చప్పున రిసీవర్ పెట్టేసి—దూరంగా వెళ్లింది)

సతి: యెంకమ్మా! వారిక్కడ లేరని చెప్పు—

యెం: యెవరితోనమ్మా?

సతి: ఆ మాలతితో!—సిగ్గులేక ఫోన్ చేసింది...

(యెంకమ్మ ఫోను దగ్గరి కెళ్లింది)

యెం: యెట్లాగమ్మా! ఫోను పెట్టేశారే!

సతి: ఆఁ...ఊఁ!!...పోనీ లే—పీడా వదిలింది.

యెం: యీ యేట్లికల్లా సేరు కొంటాల్లేమ్మా- సెప్పకున్నా పరవాలేదు.

సతి: చాల్లే నోర్మూయ్!-నీకూ యేమన్నా చెప్పి వెళ్లారేమిటి నన్నేడిపించమని?

మెం: అయ్యోరామ! అట్టాగంటారేంటమ్మా- యేవిమెట్టా గున్నా మీభార్యాభర్తలు సంతోషంగా వుంటేఅంతే సాలు గదమ్మా నాకు—

సతి: కాకపోతే యేమిటే! అనురాగమున్న భర్త అయితే యిలాచేస్తాడే! యెంత ఓర్పుగల యిల్లాలయితేమట్టుకు తన భర్త-కళ్లెదుట పరస్త్రీలోలు డౌతూంటేసహించి వూరుకోగలదే!!

మెం: అయ్యగారు...అట్టాంటోళ్లామ్మా!

సతి: నేనూ అలాగే అనుకున్నా మొదట్లో...అంతయేకపత్ని వ్రతులే ఔతే యీమాలతీ యీ గొడవా యిదంతా దేనికి?

(కారు డ్రైవరు ప్రవేశం)

కారుడ్రైవరు: కేశవరావుగారిల్లిదేనాండీ!

మెం: ఆc! యిదే!– యేంబాబూ? ఎందుకు?

కా. డ్రై: డాక్టరు గారున్నారాండీ!

సతి: లేరు... దేనికి?

కా. డ్రై: మాలతిగారు కారు పంపించారు వారిని తీసుక రమ్మని—

సతి: అయితే అసలు రాత్రిగా లేరిక్కడ– వెళ్లు.

కా. డ్రై: అదిగాదమ్మా...యీ ఉత్తరం......

సతి: ఉత్తరం వద్దు...ఏం వద్దు...ముందు వెళ్లు—

కారుడ్రైవరు: అయితే మరి ఏం చెప్పమంటారు?

సతి: చెప్పేదేం లేదూ చేసేదీ ఏం లేదు...ముందునువ్విక్కడ నుంచి వెళ్లు- (కారుడ్రైవరు వెళ్లాడు) మాలతిట... మాలతి?! సిగ్గు లేకపోతే సరి...ఫోను చేసించి చాలక మళ్లీ కారుపంపింది—అయినా మనబంగారం బాగుంటే కంసాల్ని అనుకోటమేంఖర్మం......

యెం: అనకూడదుగానీ—కోప మొస్తే ముందూ వెనకా తెలియదు మీాకమ్మగారూ!

సతి: ఏం?

యెం: ఆ డయివర్ని అలాపంపటమేం బాగుంది?

సతి: ఆం!?

యెం: వాడేదో ఉత్తర మిస్తాంటే తీసుకోలేదేం?

సతి: దేనికదీ?

యెం: అందులో యేం రాసుందో? యేదైనా ప్రేమా-గీమా-వాటిగురించీ......

సతి: అవునే అవునే-గుర్తుకు రాలేదు—వెళ్లు వెళ్లు...తొందరగా వెళ్లు- వాణ్ణిపిలు!...

యెం: (వెళ్లివచ్చి) యింకా యెక్కడమ్మా అప్పుడే వెళ్లాడు!

సతి: పోనీలే! పీడాపోయింది... వెళ్ళనీ... వెళ్ళియేం చెప్పు కుంటాడో!

యెం: అన్నట్టూ—యెవరమ్మా మాలతీ అంటే!!

సతి: యెవతో సిగ్గులేనిది...హుఁ! యిది నాపాలిట పడింది!

యెం: యేంకాలమో!ప్చ్ప్చ్...అన్నీ యీమధ్య యిలాంటి...

సతి: యిదిగో యెంకమ్మ నే చెప్తున్నాచూడు—

(బయట తలుపు తట్టారు)

సతి: (విన్పించుకోలేదు) మనవాళ్లు గట్టివాళ్లవుతే ఎంతమంది యేం చేస్తేయేం!

(మళ్లీ తలుపు)

బయిట్నుంచి: మేం లోపలికి రావచ్చాండీ!

సతి: వీళ్లెవరు?—యెంకమ్మా! (తలుపు తీయమంది)

బయట్నుంచి: May we enter in sir?

యెం: వస్తున్నా నండీ? (తలుపు తీసింది)

[పుష్ప—మేరీకాంతల ప్రవేశం]

పుష్ప: Hullo! (దీర్ఘంగా అనటంఅలవాటు. కాస్సేపటిలోనే గుర్తించింది తాను Wish చేసినవారు లేరని) Oh!! Sorry! డాక్టరు కేశవరావు గారిల్లను కున్నాం?

సతి: అవును. వారిదేగా యీ యిల్లు—

మేరీకాంత: వారిదేనా?— I see!

పుష్ప: ఐతేవారు మీకేమవుతారు?

సతి: వారు మావారే! (సిగ్గుగా)

మేరీకాంత: Oh! Mrs కేశవరావ్! (ఒకరినొకరు చూసుకొన్నారు)

సతి: కూర్చోండి...

పుష్ప: ఓ! Thanks—(కూర్చున్నారు)

సతి: యిదిగో వెంకమ్మా—(ప్రక్క కెళ్లింది. వెంకమ్మకేదో చెప్పి పంపింది... ఈలోగా వీళ్లిద్దరూ Magazines తిరిప్పుతున్నారు)

సతి: మీరెవరో యింతకూ—

పుష్ప: ఆదర్శనారీ సమాజం అని...

మేకా: యీ సిటీలో ఐదునెల్ల క్రింద ఓ Association స్థాపింప బడ్డది...

సతి: ఉహూం!

మేకా: యువతీ యువకులసమస్యాపరిష్కారాలూ...

పుష్ప: స్త్రీజన దాస్య విమోచనా ప్రయత్నాలూ...

మేకా: మొదలయిన విస్తృతకార్యక్రమాలు మాఆదర్శనారీ సమాజ పరమాశయాలు!—

సతి: ఓహో!!

పుష్ప: తరతరాలుగా స్త్రీ బానిసగా బ్రతుకుతోంది భారత దేశంలో. గాలీ వెలుగూ సోకని నట్టింటి అజ్ఞానాంధకారంలో నారీ హృదయం పొగచూరింది—

మేరీ: యీ అదనున మా ఆనాసాను చేయూతగొని—ఆంధ్రదేశపు ప్రమదలందరూ విజ్ఞాన ప్రమిదెలను వెలిగింపచేయాలని మాయీ అహర్నిశ సేవాదీక్షలోని కృషి సారాంశం.

సతి: యేమిటీ! మధ్యలో యేదో అనాసా అన్నారు!...

మేరీ: No No-అనాసా Fruit కాదు. ఆదర్శనారీసమాజ్!

పుష్ప: oh! Sorry. మరిచేపోయాను- మమ్మల్ని మేం పరిచయం చేసుకోవద్దూ!...వీరు మేరీ కాంతగారని మా సమాజ్ కార్యదర్శిని—

మేరీ: వీరు పుష్పగారు. మా సహాయ కార్యదర్శిని.

(యెంకమ్మ టీ తెచ్చింది)

మేకా: (ఉద్రేకంగా) వైజ్ఞానిక రంగంలో నైతేనేమి—సామాజిక రంగంలోనైతేనేమి- ప్రాచీన భారతదేశాన్నొకసారి పరికిస్తే, మనమంతానారీ...

సతి: టీ తీసుకోండి-

మేరీ: ఓ! ఓ!—(తీసుకుంది)

(మేరీకాంతకు టీ యిచ్చేటప్పుడూసతి టీపాయ్ దగ్గ

రకువచ్చి టీకప్పు తీసుకొని నేప్పుడూ, పుష్పటీవంక అదు
దాగా చూస్తోంది)

సతి: మీకు టీ అలవాటే ననుకుంటాను,... లేక కాఫీయా?

పుష్ప: అలవాటే లెండి- (తీసుకుంది)

సతి: (తానూ టీ త్రాగుతోంది)

(ఇంతలో ఫోను మ్రోగింది. యెంకమ్మ వెళ్లి Receive చేసింది)

యెంక: అలో- ఎవరూ?— బాబుగారా?—
నేనండి... యెంకమ్మని...ఊ ఊఁ!— ఆ ఆఁ!—
అట్టాగేనండి—ఆఁ!—సరే బాబుగోరూ!— (పెట్టేసింది)

సతి: (త్వరత్వరగా టీ తాగేసి వచ్చి) ఎవరే?

యెం: బాబు గోరే నమ్మా!

సతి: యేమిటో?

యెం: ఈ రేత్తిరికి బాబుగోరు రారట. మీరు వారికోసం కాసుకోకుండా బోంచేయమన్నారు:

సతి: (కోపాన్ని అణచుకుంటూ) ఊఁ!

యెం: రేత్తిరి అంటే రేత్తిరంతాకాదు- తరువాతెప్పుడో వస్తారంట...

సతి: (కోపం స్థాయినందుకొంది) సడేలే! నీ వెళ్లు.

పుష్ప: Thank yon madam! (టీకప్పు టేబులు పై పెడుతూ)

సతి: (చిరునవ్వుగా) తీసుకోండి!

మే. కా: Very many Thanks.

(వెంకమ్మ టీకప్పుతో లోపలికి వెళ్లింది)

మే. కా: ఆఁ! యిహ చెప్పండి...

సతి: ఏ ముందండి- మీరే చెప్పాలి...

(లోపల్నుంచి గడియారం అలారంకొట్టింది)

పుష్ప: ఫోనా?

సతి: అహా! కాదులెండి-టైంపీసు- అలారం...

మే. కా: యిప్పుడేం అలారం!

సతి: అహహా! అదికాదులెండి—రాత్రిగానీ పగలుకానీ వేళ తప్పకుండా భోంచేయాలని మావారు, రాత్రి ఎనిమిదికీ పగలు పండ్రెండింటికీ అలారం పెట్టుకోవటం అలవాటు—

పుష్ప: అబ్బా! రోజూ నిమిషం తప్పకుండా భోంచేస్తారన్న మాట!!

మే. కా: How punctual it is!

పుష్ప: అంటే యిది భోజనం టైం అన్నమాట!

సతి: (చిరునవ్వు)

మే. కా: మరి టీ ఆకల్ని చంపివేయదూ?

సతి: ఫరవాలేదు లెండి. తరువాతే Meals చేస్తుచ్చు—

పుష్ప: అంటే మీ మీల్ టైం వేరే ఉందేమిటి!

సతి: లేదండి. యిద్దరం ఒకేసారి...

మే. కా: ఓహో హో—ఎంత బాగుంది ఎంత బాగుంది!! భార్య భర్తలు, యెదురెదురుగ్గా వేళతప్పకుండా... కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ— ఓహో చాలా బాగుంది.

పుష్ప: మీది ఆదర్శదాంపత్యమండి!- యీనాటి దేశానికి యిలాంటివి ఎన్నైనా కావాలి...

మే. కా: మాకు చాల సంతోషమైందండీ. ముఖ్యంగా మీ ఆదరణా మర్యాదా- అంతకన్నా ముఖ్యం మీ భార్యా భర్తల గృహజీవితం! ...ఓహో బ్రహ్మాండం!

సతి: (కన్నీరొత్తుకుంది)

మే. కా: ఏంటమ్మా అది!

పుష్ప: మీరలా కన్నీరొత్తుకోట మేమిటీ?

మే కా: లేక..మా రాకవల్ల ఏమైనా...!

(లోపల్నుంచి యెంకమ్మ వచ్చింది)

పుష్ప: Mrs కేశవరావుగారూ! కాస్త యిటుచూడండి. ఒక్కమాట—

మే. కా: (వెంకమ్మతో) యెందుకమ్మ గారలావున్నారు!

వెంక: యేమిటోనండి! మధ్యాహ్నం నుంచి అయ్యగోరూ అమ్మగోరూ దూరదూరంగా వుంటంచూస్తే, యేమైనా ఒకర్నొకరు అనుకున్నారేమోనని—

పుష్ప: అలా చెప్పవేం మరి!

మే. కా: నేననుకుంటూనేవున్నా యిలాంటిదేదో జరిగి వుంటుందని—

పుష్ప: భర్తలతో వచ్చిన తిప్పలే యిది!

మే. కా: భార్యలు పడే బాధలే యివి!

పుష్ప: యిలా యిల్లాళ్ళ నగచాట్లుపెట్టే భర్తలకెట్లాగైనా బుద్ధి చెప్పాలి—

మే. కా: మమకారం చంపుకొని మాలాగా భార్యలంతా దీక్షా కంకణం ధరించాలి—

పుష్ప: మా ఆదర్శనారీ సమాజమందుకే వుంది!..

మే. కా: ఆఁ! పైకిచెప్పలేక కుమిలి పోయే యిలాటి వాళ్ళనాదరించటం కోసమే మేమంతా వుందీ!—

సతి: (తలెత్తింది)

పుష్ప: ఆఁ! నిజమండీ- మా మాటలు నమ్మండీ!

మే. కా: మీలాంటి వారి సమస్యల చర్చించటమే కదండీ మా ప్రధాన కర్తవ్యం!

సతి: ఊఁ!!

మే. కా: అవునండీ- యిప్పటికప్పుడే సిటీలో ఓవంద మంది సభ్యులు చేరారుకూడా—

సతి: నిజంగా!

పుష్ప: అంతా గౌరవ కుటుంబాలవాళ్లే సుమా! కావలిస్తే...
......(ఫైలు తీస్తుంది)

సతి: అబ్బే!— యిప్పుడెందుకు లెండి అవన్నీనూ. (మెల్లిగా) మరి సమాజం రూల్సన్నారే...అవేవో......

పుష్ప: యేమున్నై— భారత దేశంలో పుట్టిపెరిగిన ఏస్త్రీయైనా యిందులో సభ్యురాలే!—

మే. కా: సభ్యత్వ చందాకూడా అట్టే లేదు.. ఏదో నెలకో రూపాయి...

సతి: మరీ...మరీ...అఆ!!...ఏం లేదు లెండి!

మే. కా: సందేహం దేనికండి?

పుష్ప: మీ అప్పుల మనుకోండి. Its our duty!!

(యెంకమ్మ లోపలికి వెళ్లింది)

సతి: మరే..Wife and husband... మనస్పర్థల్తో...బాధ పడుతున్నారనుకోండి...ఒకరంటే మరొకరికి పడటం లేదనుకోండి...ఆలాంటిపరిస్థితుల్లో......మీసలహా యేమిటి? అహా! ఏదో అనుభవం వున్నవాళ్లు కదా!

మే. కా: అమాట నిజమనుకోండి...

పుష్ప: ఐనా కాస్త కూస్తా Experience అన్నానా! మాజీవితాలు యిలా గడచి పోవాల్సిందే!!

మే. కా: మిమ్మల్నొకటి అడిగితే ఏమను కోరుగా?

సతి: అడగండి...

మే. కా: సమాజం విషయాలు అడుగుతున్నది మీగురించేనా? లేక...

సతి: నాగురించే ననుకోండి—

మే. కా: ఐనప్పుడూ మరి మీవిషయం అలా దాచిదాచి అడుగుతారేం? ఏదైనా సమస్యను తేల్చాలంటే సమగ్రంగా ఆ సమస్యా చరిత్రముందుగా తెలిసి వుండాలి-

పుష్ప: నిజం!

సతి: అంటే?

మే. కా: అంటే యేముందీ! Husband అనీ Wife అనీ, పరోక్షంగా అనే బదులు- మీమధ్యా డాక్టర్ కేశవరావు గారి మధ్యా సమ సంబంధ సామ్యం కుదరటం లేదని చెప్ప గూడదూ!!

పుష్ప: (మే. కాతో) మీరూ అలాగే అంటారు మరీనూ! అవన్నీ వార్కికి వారే మనతో యెలాచెప్తారేం?

మే. కా: ఏం! ఎందుకు చెప్పకూడదేమిటీ? మనమేం పరాయి

వాళ్ళమూ! పడనివాళ్ళమూ!—యిలాంమనస్తత్వాలింక
వుండబట్టే యింకా మన దేశం.........

సతి: అబ్బేబ్బే...అలా ఎందుకంటానండీ మిమ్మల్ని.....

పుష్ప: మీరంటే మీరేకాదు—యీనాడు మన Country
లో గృహిణులందరూ యీలాగే భర్తల చర్యలను
సమర్థించే వారేగాని—

మే. కా: ఆగండి మీరు... ఏమండీ అసలు మీపోట్లాట
దేన్ని గురించి?! ఎన్నాళ్లయింది!— చెప్పండి...

సతి: ఊc!

మే. కా: Please!

సతి: ఏంలేదండీ!?—ఓవారం రోజుల్నుండి మావారికో పిచ్చి
పుట్టింది. అవేవో వున్నాయి చూడండి— శిశుసంర
క్షణాలయాలనీ, మాతృప్రసూతి కేంద్రాలనీ— అవి
యీ నాడు దేశంలో ఉచితంగా పనిచేయటం అత్యవ
సరమట! అందుకని— వారు డాక్టరుగదూ— వారితో
బాటూ ఆకార్యక్రమాల్లో పాల్గొంటానికి కాస్త అను
భవమున్న స్త్రీ కావాలనీ....కడకు— ఊc!... ఊc!...
మాలతి అనే అమ్మాయినీ... ఊc!...ఊc!!!......

పుష్ప: తన అసిస్టెంటుగా అపాయింట్ చేసుకోనుంటారు
అంతేనా!

సతి: అంత మాత్రమైతే యింకే!!

మే. కా: లేకపోతే ఆమె గారికీ... మీ వారికీ!!...

సతి: (గాద్గదికంగా) యెంత పరిశుత్వం చేస్తేయేం-వారిపట్టు దల వారిది——

పుష్ప: ఇటువంటి వేమీ కొ్రొత్తవి కావండీ! మాకివన్నీ గతా నుభవాలే కదా!

సతి: ఆఁ?

మే. కా: మనసమాజసభ్యులందరి జీవితాలూ దాదాపుఅన్నీ యీ విధంగానే——

సతి: ఒకసారి రెండుసార్లయితే యెవరైనా ఓర్చుకోగలరు కానీ...

పుష్ప: అవునమ్మా ఆవును— యివన్నీ యింతే!——అమ్మయ్యా! నా అదృష్టం కొద్దీ మన ప్రభుత్వం తొందరగానే హిందూ కోడ్ బిల్ పాస్ చేయటంవల్ల విడాకు లిచ్చుకో గలిగాను కానీ—లేకపోతే మావారు పెట్టే యమ బాధలకి తట్టుకో గల్గేదాన్నా!

సతి: ఆఁ!!!

మే. కా: నేనివల్లా ముందుగానే ఆలోచించేకదండీ! పెళ్ళి చేసుకోకూడదు జీవితాంతం దాకా అని నిశ్చయించు కుందీ!

సతి: ఆఁ!!!

పుష్ప: ఆఁ!అలా చేయండే దేశపునర్నిర్మాణంలో నేటి స్త్రీలు మేస్త్రీలు కాలేరుమరి!

సతి: యింత అల్పవిషయాలకే.......

మే. కా: అల్పమేంటండీ! సైకలాజికల్ గా ఆలోచిస్తే ఒకసారి యిద్దరిమధ్య మనస్పర్థలు యేర్పడితే అవియెప్పుడూ పూర్తిగా సమసిపోవు. మెల్లిగా క్రిమక్రిముంగా రాజుకుంటూనే వుంటాయి——

సతి: యేమోనండి!...నేను...

పుష్ప: అదే వచ్చిందిమీతో!... మళ్లీ మొదటికి వచ్చారు.

బయట్నుంచి: కేశవరావుగారూ!

(అందరూ అటువేపు చూశారు)

బయట్నుంచి: కేశవరావుగారూ!!

(సతి వెళ్ళి తలుపులుతీసింది. Mr. M.S.N. హామ్ప్రవేశం)

Ham: (పుష్ప, మేరీకాంతాలను ఆశ్చర్యంగా చూస్తాడు) Hello! Good eve madams!

పుష్ప: Good evening Ham! యేమిటీ యిలా వచ్చారు? (Shake hands చేశారు)

Ham: డాక్టరుగారికోసం వచ్చాను. మీరూ?

మే. కా: అన్నట్టు పుష్పగారూ! మనం ఏవో మాటల్లోపడి వచ్చినపనే మరచిపోయాం.

పుష్ప: అవునండి! (Ham తో) డాక్టరుగారు లేకపోయేసరికి యేదో కాలక్షేపంలో దిగాం......

మే. కా: సరే అదీ ఓ మంచికే లెండి—

Ham: డాక్టరుగారు లేరేమిటి?

మే. కా: లేరండి...ఇదిగో యిక వీరితో...ఓ!మరిచేపోయాం మిస్టర్ హేమ్! వీరు Mrs కేశవరావుగారు...

Ham: హల్లో- Very glad to meet you (చేయిచాపుతాడు shaking కోసం)

సతి: నమస్తే—

మే. కా: వీరు Mr. M. S. N. Ham గారు. మా ఆనాసాకు Advisor గారు.

సతి: ఏమిటి? Ham గారా! ఆఁ!

పుష్ప: పూర్తిపేరు యం. యస్. నరసింహంగారు...అయితే యీ కాలంలో Shortage అన్నది ఓ ప్రత్యేకత కనుక Fashionable గా Mr. M. S. N. Ham అయ్యారు—

మే. కా: వీరిని గురించి చెప్పదలిస్తే- ఓ పెద్దబయోగ్రఫీ. కానీ సూక్ష్మంగా చెప్పాలంటే ఒక్కమాట చాలు..

పుష్ప: శ్రీ కృష్ణు డంతటివాడు...

Ham: సరే. దానికేంగానీ!—కేశవరావుగారు లేరండీ?

సతి: ఊహుఁ! లేరండి—

Ham: Thanks— ఎక్కడికైనా వెళ్లారేమో!ఎంతసేపైంది?

సతి: ఇప్పుడే వెళ్లారు—

Ham: Oh! thanks!- ఆయనతో కాస్తావనుండి వచ్చా
నండి...

సతి: నాతో చెప్పండి–నే చెప్తాగా!

Ham: Excuse me Its Personal.

సతి: ఓహో!-అయితే ఏంలా? యిప్పుడేరారే!

Ham: Then puspa! what shall We do?

పుష్ప: మేకికాంతా! యేం చేస్తావిప్పుడు?

మే. కా: సతిగారూ! మరి మమ్మల్నేం చేయమన్నారు?

సతి: ఆఁ! ఏమిటి!

మే. కా: అదే...మీ సభ్యత్వం...

Ham: What's that? may I know madam?

పుష్ప: అయ్యో!.. మీ రెందుకు తెలుసుకోకూడదు?
All in all మీరాకపోతే మేమెవరితో చెప్పమండి?

మే. కా: Ham! డాక్టరుగారూ యీమె... They are not in good terms.

Ham. Oh! is it? Never mind madam. (పుష్ప భుజం తడుతూ) Friend! why not you make her our member!

పుష్ప: అదే గదండీ మా యీ Attempt అంతానూ!

Ham: వచ్చినప్పట్నుంచి ఏదో మరచి పోయానని feel అవుతున్నా- యిప్పుడు గుర్తుకు వచ్చింది......... Miss Mary!

మే. కా: Yes sir!

Ham: Govern ment's supervision ఎప్పుడన్నారింతకూ?

మే. కా: రేపు Monday నే కదండీ!

Ham: Oh! Never mind...

సతి: యేమిటి! యేదో గవర్నమెంటూ...

పుష్ప: అది కాదండీ! మహిళా సంఘాలు ఏవి స్థాపింపబడినప్పటికీ ప్రభుత్వం గుర్తించనిదే—వాటికర్థం వుండదూ సహాయమూ రాదు!

సతి: అలాగయితే...

మే. కా: అందుకని మా ఆదర్శనారీ సమాజాన్ని గుర్తించే ముందుగా ప్రభుత్వం వారు అన్ని విషయాలూ పరిశీ

లించటానికనే రేపు సోమవారం నాడు వస్తున్నారన్న మాట......

సతి: ఇతే మిమ్మల్నింకా గుర్తించలేదన్నమాట—

Ham: But అంతమాత్రాన యిదేదో గాలికెగిరిపోయే మాన్యాళ్ళ కబ్ అనుకోకండేం?!

మే. కా: తప్పక గవర్నమెంటు మమ్మల్ని రికగ్నైజ్ చేస్తుంది

పుష్ప: యీ రోజు కాకపోయినా రేపైనా.

సతి: ఊం!—యేమో—మావారేమంటారో—

మే. కా: అదుగో మళ్లీ......

పుష్ప: మీ యిష్టాయిష్టాలపై మీ వారికే మధికారం?

సతి: అదికాదండీ......

పుష్ప: ఏదీకాదండి...మీరు తప్పక చేరాలి.

మే. కా: యికే ఆలోచనా లేక...Please (అప్లికేషన్ ఫారం తీస్తుంది)

Ham: (సతిభుజం మీద చేయివేశాడు అలవాటుచొప్పున) Mrs కేశవరావ్! Just see me —

సతి: (భుజం మీది Ham చేయివంకా—మొహంవైపూ తేరిపారచూసింది) మర్యాదగా మీరు దూరం వుండండి.

Ham: (పక్కకు కదుల్తాడు)

మే. కా: పెద్దవారిని అలాగ అనొచ్చాండీ?

సతి: పెద్దరికముంటే వారిదగ్గరే వుండనివ్వండి. అంతేగాని..

Ham: Miss మేరీ! మీకు క్రొత్తవారు— వారితో యేమిటీ?

పుష్ప: ఏమిటండీ Mr. Ham! మనసొసైటీకి వారింకా అలవడలేదుకదా! (సతితో) పొరబాటే జరిగిందిలెండి... మీరేమీ వేరే భావించకుండా..

Ham: Madam! ఒక్కమాట—(మరీ అలవాటుచొప్పున భుజంమీద చేయివేశాడు)

సతి: ఛీ! నీచుడా— బయటికివెళ్లి మాట్లాడు. ఊఁ! నడు ముందు.

పుష్ప: ఏమిటీ!

మే. కా: ఇలా అనటం...

సతి: అనటంలేదు.. వినటంలేదు.. నడవండి ముందు బయటికి.

Ham: కేశవరావుగారు మా స్నేహితుడు..

సతి: అందుకే మర్యాదగా బయటికి నడునమన్నాను.

Ham: But Its damn Insult! మేం వచ్చింది మీకొరకుగాదు.

పుష్ప: ఏదో మిమ్మల్ని అదరించాలనీ.. మా సమాజమూ...

సతి: నన్నేం మీరుద్ధరించనక్కర్లేదు— నడువండి.

(హాం బయటకు వెళ్లిపోయారు. యెంకమ్మ వచ్చింది)

మే. కా: మీ గురించికూడా రాలేదు— డాక్టరు గారితో...

సతి: వెళ్తారా? లేదా?

పుష్ప: వెళ్తాం వెళ్తాం...హుం! రండి Miss మేరీ!—

మే. కా: హుం! (ఛీత్కరిస్తూ నిష్క్రమించారు...

సతి వీళ్లను చూస్తూకాస్సేపు నుంచుంది - దుఃఖంతో శ్వాసపుటాలు అదరుతూవున్నై)

యెం: అమ్మగారూ!

సతి: యెం...క...మ్మా!!

యెం: బాధపడకండమ్మగోరూ—

సతి: యెం..క..మ్మా..చాలతప్పుపని చేశాను.

యెం: సేయరాని పెద్దతప్పేం చేశార్లేమ్మా—

సతి: కాదెంకమ్మా...కాదు...గొప్పతప్పుచేశాను—క్షమింప రానిది.

యెం: యివి అందరికీ మామూలేనమ్మా! కొత్తలో అంతా యింతే... ఒకరి మనసొకరు తెలుసుకుంటే అదేసరి పోద్ది—

సతి: ఊహుం! వారిహృదయం నాకు బాగా తెలుసు... నన్ను బాధపెట్టటం వారికిష్టం.

మో: అదెట్టా సెప్తాలేమ్మా- ఆరినే మీరుసరిగా అర్థంసేసు కోలేదేమో—

సతి: అర్థం చేసుకోకపోవటమేమిటి నీ మొహం!

మొం: అదికాదులేమ్మా- అప్పుడప్పుడూ అలుకలూకినుకలూ కల్గినా ఆలుమొగుళ్లంటే ఒకరికొకరు అర్ధాలుగా మసలుకుంటేనే సంసారం సాగేది!

సతి: అదెప్పుడూకాదు. పెళ్ళాన్ని నీచంగా చూస్తున్నప్పుడు యిద్దరూ కలసికట్టుగా కాపురం చేయటం అసాధ్యం.

మొం: అయినా కూడా ఆడది అనగిమనగి నడుసుకున్నప్పుడే నమ్మా అందమూ సందమూ!

సతి: అదేవచ్చింది మీ ముసలాళ్లతో—ఎంత బాధపడుతున్నా యింకా అణగీ మణగీ-హుం! అలాయెప్పుడూ జరుగదు. అలాంటప్పట్లో యెవరికి వారు వేరువేరుగా నివసించటంమేలు—

మొం: అమ్మా...అనుభవంలేని మాటలు అట్టాగే వుంటాయి. ఆడది మగాడిపై ఆధారపడకుండా బతగ్గలదా?!

సతి: ఏం? యేంకష్టం? పురుషుడి లాగానే సమంగా చదువూ, ఉద్యోగమూ......

మొం: యేంమాటల్లేమ్మా- ఆ ఉద్దేగం సేయడం ఎక్కడా? యింకో పురుషుడి దగ్గరేగా!

సతి: యెక్కడైనా సేయగల్దు- తనయిష్టప్రకారం!

యెం: ఆఁ! సేయగల్దు— అందరి యెదుటా సేసుకున్న భర్తని వదిలేయగల్లేగాని, యింకోడి సావాసంలేకబతగ్గలదా! అయినా ఏందోలేమ్మా... మీకర్థంగావు మేంసెప్పే మాటలు——

సతి: యెంకమ్మా!

యెం: అవునమ్మా అట్టాగే వుంటుంది... యింౘాక జరిగిందంతా లోపల్నుంచి సేనుయింటూ సేవున్నా. ఆళ్లుసెప్పే మాటలూ—ఆళ్లనడతలూ, మీకు కాబట్టిసరిపోయింది గాని యింకోరయితే యింట్లో అడుగెట్టనిచ్చేవారా!

సతి: అవును నాకూ అసహ్యమేసింది!

యెం: అట్టాటోళ్ల రావడం— అన్నం పున్నెం యెరుగని యిట్టాంటోళ్లను లాగడం——యిదిగో సత్తమ్మగారూ నే సెప్తున్నా యినండి— మగుణ్ణి వదిలిన యే ఆడదీ యింతవరకూ యెక్కడా బాగుపడలేదు. మొన్నే పిచ్చిది కనబడ్డది. బజారెంట పిచ్చిపిచ్చిగా పోతుంటే, వాళ్లూ వీళ్లూ రాళ్లతో కొడుతూంటే— దానిఅవస్త యేమని సెప్పను? అదీనేనూ సిన్నప్పుడు కలసి తిరిగినోళ్లం. సిలకలా కాపురం సేసేది!—బయటకొచ్చింది- దాని బతుకట్టాకాలిపోయిందీనాడు...

సతి: పాపం!!

యెం: అందుకేనమ్మా— ఎప్పుడూ పతిసేవ తప్పకూడదనేది!

సతి: ఆc! అవన్నీ పూర్వాచారాలు. యిప్పుడు కావు. అయినా భర్తకూ గిరస్తైనప్పుడు కూడా - అతణ్ణే పట్టుకు వ్రేలాడ్టం ఉహుc! హీనం - నీచం——

మొం: ఇట్టాగంటే యేంసెప్పేదమ్మా మీతో నా మొగుడు మరి తాగుబోతు. అయితే మీ మాట పెకారం వదిలేయాల్సిందేనా?——నిజమే! ఒక్క పైనా సంపాదించ లేడు. నేనే పోసించాల. తెచ్చిందంతా తాగుడుకే పెడుతుంటాడు - అట్టాంటప్పుడు నేనేం సెయ్యాలి? సేతనైతే అలవాటు మాన్పించాల. లేకపోతే సేతనయేంత వరకూ బాధపడుతుంటూండాల్సిందే!

సతి: బాధ పడ్డం దేనికి?

మొం: బాధ పడకూడదంటరా? కానియ్యమ్మ సండి - యిందాక వాళ్లేదేదో మెక్కడో సేద్దామనుకున్న సేనను, వాళ్ళ బర్తలకే సేయమనండి మరి! వాళ్ళెవరినో ఏదో ఉద్ధరించాలనుకుంటున్నదంతా వాళ్ల భర్తలను మంచిమార్గంలో పెట్టడంలో సూపమనండి - అంతేగాని......

(యింట్లో ఏదో చప్పుడైంది)

సతి: (శ్రద్ధగా వింటోంది)

మొం: యేంటో లోపల సప్పుడౌతోంది. యిప్పుడే వస్తా——

(లోపల కెళ్లింది)

(సతి ఆలోచిస్తోంది- యెంకమ్మ చెప్పినమాటలే ప్రతి ధ్వనిస్తున్నాయి)

సతి: వాళ్లు మా మాటలు వింటూగా?

ప్రతిధ్వని: వినరు. వినకపోతే మట్టుకు—విన్నట్టు చేయాలి. సమానంగా చదువుకున్నది దేనికి? హక్కులూ అధి కారాలూ సంపాదించుకున్నది దేనికి?

సతి: దేనికి?? దేనికి??

(కేశవరావు ప్రవేశం)

కేశ: (తొందర తొందరగా వస్తూ) సతీ!సతీ!

సతి: (ముఖం ప్రక్కకు తిప్పుకుంది)

కేశ: ఏమిటిది సతీ!

సతి: (పలుకదు)

కేశ: కోపంవచ్చిందా! చెప్పు సతీ!

సతి: నాకూ దేనికి కోపం!– వచ్చినా యేం ప్రయోజనం!

కేశ: యేమిటంటూ వేమిటి మరి! వాళ్ళ నావిధంగా అవమాన పరుచట మేం బాగుంది!

సతి: అవమానమా! యింకా మేలు. యేమైనా చేసి వుండా ల్సింది!

కేశ: ఏం చేశారు?

సతి: వాళ్ళ ప్రవర్తన —ఛీ!

శే: అలాంటప్పుడు నాకెందుకంత నొప్పి పుంచావు? ఏదో ఒకటి చెప్పమంటున్నా సరిగా [illegible]!

శి: (పలుకదు)

శేష: ఇప్పుడు [illegible] చేసిపోయాను సిగ్గా [illegible]!

శి: ([illegible] తల [illegible])

([illegible] వస్తుంది)

శే: మాట్లాడవేం? ([illegible]) [illegible]?

సుం: [illegible]! [illegible].

శే: ఇదిగో [illegible] వాటితో జాగ్రత్తగా [illegible]...

([illegible] లోపలికి [illegible])

శి: సరి..ఆగాలి... [illegible] ...ఎన్ని రోజులకి?

శే: [illegible]! ([illegible])

([illegible] స్త్రీ [illegible] వచ్చింది [illegible] పరిచయం.)

శే: సరే!—మరో [illegible]...

సతి: చూసేదేముంది!

కేశ: ఏమిటది సతీ!—యితరులెవరైనా చూస్తే యేమంటారు!

సతి: యేమనుకుంటే యేం?

కేశ: అదికాదు- యిటుచూడొక సారి...

సతి: (పలుకదు)

స్త్రీ: వీరేనాండీ సతిగారూ?

సతి: (చప్పున తిరిగిచూసింది)

కేశ: అవునండి—

స్త్రీ: ఏమిటమ్మా! మిమ్మల్ని చూడాలనే రావటం!!

కేశ: సతీ! వీరెవరో తెలుసా! మాలతిగారని- నేనెప్పుడూ చెప్పుతుంటానే-వారు.

సతి: (నిర్ఘాంత పోయింది) మాలతిగారా!!!

కేశ: వీరే యిప్పుడు ప్రారంభించదలచిన మన ప్రసూతి కేంద్రానికి కార్యదర్శిగారు—

సతి: నమస్కారమమ్మా!!

కేశ: కానీ సతీ! వీరి పరిచయభాగ్యం కలగడం మన అదృష్టం- యింత ముదుసలిప్రాయంలో వున్నకూడా వీరు నిత్యమూ దేశసేవలో లీనమై యుంటారు.

మాలతి: ఏమిటో లేమ్మా-అభిమానం కొద్దీ అంటారవన్నీనూ!

(యెంకమ్మ వచ్చింది)

సతి: యీ విడ మాయింట్లో పనికత్తె.. యెంకమ్మ. మాకుటుంబానికో పెద్ద దిక్కు—

సతి: యెంకమ్మా! వీరెవరో తెలుసా—మాలతిగారు—

యెం: నమస్కారమమ్మగారూ!

మాలతి: నమస్తే!!

యెం: బాబుగోరూ! మీకోసమిందాక... యెవరోయిద్దరు...

సతి: చాల్లే చెప్పావుకాని—

కేశ: యెవరూ? వాళ్ళిద్దరేగా— పుష్పా... మేరీ!!...

యెం: ఆ అఁ!

మాలతి: అంటే... యిప్పుడెదురైన వాళ్ళేనాండీ!

కేశవ: అఁ! వాళ్లే-యింతకన్నా యేం పనుంది యిల్లిల్లూ తిరుగటంకన్నా—

సతి: నన్ను మీరుక్షమించాలి. మావారు చేసిందానివల్ల అనవసరంగా మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను...

యెం: బాబుగారూ! ఆవచ్చిన యిద్దరికి తోడుగా మరీ యింకో డూనచ్చి... వచ్చి... ఏంచేశాడంటే...

సతి: యిప్పటికయింది చాలుగాని వెళ్ళి మాకేవో కాస్సిన్ని కాఫీ అవీ తయారు చెయ్యమ్మా తల్లీ—(మాలతితో) రండి... (లోపలికి దారి తీశారు)

—తెర—

శ్రీ దుర్గా ప్రెస్, నంద్యాల.

blank page

82

ఉజ్వల ప్రచురణలు

ప్రాణేశ్వరి	(డి. మనోహర్)	4–00
వాసంతి	,,	3-00
కోరుకున్న వరం	,,	2–00
అందని శిఖరాలు	,,	2–00
మూడు పువ్వులు	,,	2–00
చరితార్థులు	(యం. యస్. ఆచార్య)	2–00
సమరసుందరి	,,	2–00
జీవిత స్వప్నం	(ఆదవేని ఈశ్వర)	3–00

'PRATHYUSHA'
by
M. Ramachandra Rao

Price
Rs. 2-50 nP.